ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

గురువారం 13 మార్చి 2025 | 5

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురు) సా.6.21

సహరి (శుక్ర) ఉ.4.51



చెప్పతరమా.. 6

ఉప్పుచేప!

- మాంసాహార వంటల్లో ప్రత్యేకం
- హోటళ్లలో, వేడుకల్లో స్పెషల్ డిష్
- ఉప్పాడలో భారీస్థాయిలో తయారీ
- విదేశాలకు సైతం ఎగుమతులు
- మత్స్యకార మహిళలకూ ఉపాధి

రేపు జనసేన ఆవిర్భావ సభ సందర్భంగా.. 7

216 హైవేపై ట్రాఫిక్

మళ్లింపు

సభకు వచ్చేవారికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు 7

- మంత్రులు మనోహర్, దుర్గేష్

ఏలూరులో లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 12 మందికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రుల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావాసులు 7

ఉమ్మడి జడ్పీ రూ.886 కోట్ల బడ్జెట్‌కు ప్రభుత్వ ఆమోదం 7

విజయ కేతనం!



- పిఠాపురం వేదికగా రేపే జనసేన 12వ రాష్ట్ర ఆవిర్భావ పండగ
- రాష్ట్రం నలుమూలల నుంచి లక్షల మంది వస్తారని అంచనా
- పిఠాపురంలో పవన్ అఖండ విజయం నేపథ్యంలో ఇక్కడే సభకు మొగ్గు
- సభకు జయకేతనంగా నామకరణం.. ద్వారాలకు మన ప్రాంతీయుల పేర్లే
- సభలో మహిళలు, మత్స్యకారులు, యువత, రైతు ప్రతినిధుల ప్రసంగాలు
- అటు ఉమ్మడి జిల్లా కేంద్రంగా అయిదేళ్లలో ఉవ్వెత్తున జనసేన పోరాటాలు
- అప్పటి అధికార వైసీపీపై ఇక్కడ నుంచే స్వయంగా పవన్ దండయాత్ర
- రైతు సౌభాగ్య దీక్ష నుంచి వారిని ఆదుకోవడం వరకు ఎన్నో మైలురాళ్లు
- అటు ఎన్నికల్లో సునామీ తీర్పుతో జనసేన వెంట నడిచిన గోదావరి జనం
- వైసీపీకి ఒక్క సీటూ రానివ్వనన్న పవన్ శపథాన్ని నిజం చేసిన గోదారోళ్లు
- జనసేన రాజకీయ చరిత్రలో ఉమ్మడి జిల్లాకు ఎప్పుడూ ప్రత్యేక స్థానమే





పిఠాపురం మండలం చిత్రాడలో జనసేన ఆవిర్భావ సభ 'జయకేతనం' కోసం వేదిక.. డిప్యూటీ సీఎం పవన్ రాక నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వేదికగా జనసేన పార్టీ జయకేతన సభకు సర్వసన్నాహాలు చేస్తోంది. పిఠాపురం కేంద్రంగా పార్టీ 12వ రాష్ట్ర స్థాయి ఆవిర్భావసభకు కనివినీ ఎరుగని భారీ ఏర్పాట్లు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కనివినీ ఎరుగని సునామీ విజయం సాధించి ఉవ్వెత్తున ఎగసిన జనసేన తన విజయ ప్రస్థానాన్ని గోదావరి జిల్లా వేదికగా పంచుకోవాలన్న సంకల్పంతో ఇక్కడే సభను నిర్వహిస్తోంది. అటు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అనేక ఆటుపోట్ల తర్వాత తొలిసారి ఎమ్మెల్యేగా విజయం రుచి చూసి రాష్ట్ర రాజకీయ దశ, దిశను గోదావరి జిల్లా నుంచే మార్చినందున పిఠాపురం ఎమ్మెల్యే హోదాలో సభను ఇక్కడే నిర్వ హిస్తున్నారు. మరోపక్క జనసేన అంటే ఉమ్మడి తూర్పు అనేలా పార్టీ ప్రస్థానం గడచిన పన్నెండేళ్లలో సాగింది. పవన్ ఉద్యమాలకు ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టారు.

అందరి దృష్టి ఇక్కడే...

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవ సభను శుక్రవారం పిఠాపురంలో అంచనాలకు మించి విజయవంతం చేసేందుకు ఆ పార్టీ ఎక్కడికక్కడ పక్కా ఏర్పాట్లు చేస్తోంది. పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడలోని ఓ ప్రైవేటు లేఅవుట్‌లో రెండు లక్షల మంది కూర్చునేలా ఏర్పాట్లు సిద్ధంచేస్తోంది. రాష్ట్రంతోపాటు తెలంగాణ, బెంగళూరు, చెన్నై తదితర రాష్ట్రాల నుంచి లక్షల మంది సభకు వస్తారని అంచనా. దీంతో స్వయంగా మంత్రి నాదెండ్ల కాకినాడలోనే మకాం వేసి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. సభకు వచ్చే వీరికి ఎక్కడా ఏ ఇబ్బంది ఎదురు కాకుండా వేలాదిమంది పోలీసులు, అంబులెన్స్‌లు, భోజన వసతి కల్పిస్తున్నారు. అయితే తొలుత అమరావతిలో మూడు రోజులు నిర్వహించాలని భావించిన ఆవిర్భావ సభను ఆ తర్వాత గోదావరి జిల్లాకు మార్చారు. జనసేనకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయంగా సెంటిమెంట్‌గా మారిన నేపథ్యంలో ఇక్కడి నుంచే తన విజయకేతన సభను నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో పవన్ సైతం సభావేదికకు విజయకేతన సభ అని స్వయంగా నామకరణం చేశారు. అలాగే సభకు మూడు ప్రవేశ ద్వారాలు ఏర్పాటుచేయగా, వాటికి పిఠాపురం రాజా శ్రీరాజా సూర్యారావు బహదూర్, విద్యాదాత మల్లాడి సత్యలింగం నాయకర్, అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మల పేర్లు పెట్టడం ద్వారా ఉమ్మడి జిల్లాకు తగిన ప్రాధాన్యం కల్పించారు. రాజకీయంగా ఇన్నేళ్లల్లో ఎన్నో ఆటుపోట్లను చూసిన జనసేనకు 2024 ఎన్నికలు కనివినీ ఎరుగని విజయాన్ని కట్టబెట్టడం, తొలిసారి అధికారంలోకి రావడంతో సాకారమైన కలను అచ్చొచ్చిన గోదావరి జిల్లా నుంచే పంచుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడే సభ నిర్వహిస్తున్నారు. దీంతో ఇప్పుడు రాష్ట్రంలో అందరి దృష్టి పిఠాపురంపైనే పడింది. తనకు రాజకీయంగా అండగా నిలబడుతోన్న గోదావరి జిల్లాలోని పిఠాపురం నుంచే 2024లో బరిలోకి దిగారు. అఖండ మెజార్టీతో విజయం సాధించి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి డిప్యూటీ సీఎం అయ్యారు. ఈ నేపథ్యంలో రాజకీయంగా తిరుగులేని విజయం సాధించిపెట్టడంతో గోదావరి జిల్లాపై మరింత ప్రేమతో ఇక్కడి నుంచే తన విజయ ప్రస్థానం పంచుకోవాలని పవన్ భావిస్తున్నారు. అటు సభలో పిఠాపురంలో తనను గెలిపించిన ప్రజలకు పవన్ ధన్యవాదాలు తెలపనున్నారు. మరోపక్క సభ సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కానుంది. మొత్తం ఐదు గంటలపాటు కార్యక్రమాలు నిర్వహిస్తారు. పవన్‌కల్యాణ్ ప్రసంగంతో సభ ముగుస్తుంది.

పోరాటమే ఊపిరిగా..

జనసేన పార్టీ పుట్టిందే ప్రజాసమస్యలపై పోరుకోసం. పార్టీ ఆవిర్భావం నుంచి అధికారంలోకి వచ్చిన వరకు ఇన్నేళ్లలో ఎన్నో సమస్యలపై జనంకోసం జనసేన పోరాటాలు చేసింది. స్వయంగా పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అనేక సమస్యలపై పోరాటాలను తూర్పుగోదావరి జిల్లా నుంచే ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరాచకాలు, అక్రమాలపై ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కదిలి అప్పటి సర్కారు వెన్నులో వణుకు పుట్టించారు. దీంతో జనం తమ సమస్యల కోసం ఎన్నోసార్లు జనసేనవైపు చూశారు. ఉమ్మడి జిల్లాలో గత వైసీపీ పాలనలో అన్నదాతలు తీవ్రంగా నలిగిపోయారు. సాగునీటి నుంచి గిట్టుబాటు ధర వరకు సమస్యలే. దీంతో 2019 డిసెంబరులో కాకినాడ కేంద్రంగా రైతు సౌభాగ్య దీక్షతో ప్రభుత్వాన్ని కదిలించారు. రహదారుల గుంతలతో జనం పడుతున్న నరకయాతన నేపథ్యంలో ప్రభుత్వాన్ని కదిలించడం కోసం 2021 అక్టోబరులో రాజమహేంద్రవరంలో పవన్ పర్యటించారు. స్వయంగా రహదారులపై గుంతలు పూడ్చారు. 2022లో కౌలురైతు భరోసా యాత్ర పేరుతో మండపేటలో అన్నదాతల కుటుంబాలకు సొంతంగా చెక్‌లు పంపిణీ చేశారు. ఇలా ఒకటేంటి అనేక సమస్యలపై చలించి కదిలారు. ఇలా ప్రతి కష్టంలోను జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రజా సమస్యలపై ఉద్యమమై కదిలింది. అనేకసార్లు పవన్ మాట్లాడుతూ జనసేనకు అధికారం ముఖ్యం కాదని జనం సమస్యలు పరిష్కారమే కీలకమని ప్రకటించారు. ప్రజల కోసం ప్రభుత్వాలపై ఎంత వరకు అయినా పోరాడుతుందని చేసి చూపించారు. దీంతో గడచిన అయిదేళ్లలో గోదావరి జిల్లా ప్రజల గుండెల్లో మరింతగా నాటుకుపోయింది. దీని ఫలితంగా పంచాయతీ, జడ్పీ, మున్సిపల్ ఎన్నికల్లో చిన్నచిన్న విజయాలతో జిల్లాలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించింది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో జనసేనకు టీడీపీతో పొత్తు కుదరడంతో ఆ కలయిక గోదావరి జిల్లాలో ఓట్ల సునామీ సృష్టించింది. దీంతో అరాచక ప్రభుత్వాన్ని దించి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కింది. అయితే అధికారం అండతో గత వైసీపీ ప్రభుత్వం గోదావరి జిల్లాను ధ్వంసం చేసి అరాచకంగా మార్చేసిందని ఎన్నికలప్పుడు పవన్ ధ్వజమెత్తారు. అందుకే గోదావరి జిల్లాలో వైసీపీకి ఒక్క సీటు కూడా రాకుండా చూసుకునే బాధ్యత తనది అని హెచ్చరించారు. పవన్ చేసిన శపథానికి గోదావరి ప్రజలు అండగా నిలబడి నిజం చేశారు. ఉమ్మడి జిల్లాలో ఒక్కటంటే ఒక్క సీటూ వైసీపీకి రాకుండా గుండా సున్నా మిగిల్చారు.

66.12 ఎకరాల భూమి పర్యాటక శాఖకు కేటాయింపు

కాకినాడ సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటకాభివృద్ధిలో భాగంగా కాకినాడ సమీపాన పర్యాటక శాఖకు 66.12 ఎకరాలు భూమిని ప్రభుత్వం ఉచితంగా కేటాయించింది. జిల్లాలో పర్యాటక అభివృద్ధి కోసం భూమి కేటాయించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఇటీవల ప్రభుత్వానికి లేఖ పంపారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీవో నెంబర్ 91 జారీ చేసింది. కాకినాడ రూరల్ మండలం తమ్మవరంలో సర్వే నంబర్ 292/3లో 16.89 ఎకరాలు, తీరప్రాంతంలో అన్ సర్వేయడ్ 49.23 ఎకరాలు మొత్తం 66.12 ఎకరాలు పర్యాటక శాఖకు ఉచితంగా కేటాయించింది. ఏపీ టూరిజం నిబంధనలకు లోబడి ఈ భూమిలో బీవోటీ, పీపీపీ విధానాల ద్వారా పర్యాటక ప్రాజెక్టులు చేపట్టనున్నారు.

రాష్ట్రంలో రూ.1.14లక్షల కోట్ల ప్రాజెక్టుల గుర్తింపు

- రాజ్యసభ ఎంపీ సతీష్‌బాబు



కాకినాడ సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగరమాల ప్రోగ్రామ్ కింద రూ.1.14 లక్షల కోట్ల విలువైన 110 ప్రాజెక్టులు గుర్తించినట్లు రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు వెల్లడించారు. బుధవారం రాజ్యసభ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సాగరమాల ప్రోగ్రామ్ కింద చేపడుతున్న, చేపట్టబోయే అభివృద్ధి పనుల వివరాలు తెలపాలని కోరారు. దీనిపై కేంద్ర పోర్ట్స్, షిప్పింగ్, జలమార్గాలశాఖ మంత్రి సర్బనంద సోనోవాల్ వివరణ ఇచ్చారు. ఈ వివరాలను ఎంపీ సతీష్‌బాబు బుధవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని తీర ప్రాంత మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు ఈ ప్రాజెక్టులు గుర్తించినట్లు తెలిపారు. పోర్ట్ ఆధారిత పారిశ్రామికీకరణను మెరుగుదల, పోర్టుల ఆధునికీకరణ, కనెక్టివిటీ మెరుగుపరచడం, తీరప్రాంతాల అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా పని చేస్తున్నాయన్నారు. విశాఖపట్నం పోర్టువిస్తరణ, బెర్త్‌ల యాంత్రీకరణ, స్టోరేజ్ షెడ్ల నిర్మాణం, కంటైనర్ స్కానర్ల ఏర్పాటు, భవానపాడు వద్ద రూ.5,390కోట్లు, మచిలీపట్నం వద్ద రూ.4,500కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల అభివృద్ధితోపాటు కాకినాడడీప్ వాటర్‌పోర్టుఅభివృద్ధి రూ.2,123 కోట్లతో కొనసాగుతుందన్నారు. కాకినాడ, విశాఖపట్నం ప్రధాన పోర్టులకు కనెక్టివిటీ మెరుగుకు రూ.10వేల కోట్లుపైగా వెచ్చిస్తున్నారన్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టు, ఉప్పాడ బీచ్ రోడ్-4 లేనింగ్‌కు రూ.1,394కోట్లు, కాకినాడ పోర్టునుంచి అన్నవరం రైల్వేస్టేషన్‌కు రైలు కనెక్టివిటీకి రూ.174 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

యువతులు, మహిళలకు ఆత్మరక్షణ శిక్షణ ఇవ్వాలి

- శాసనమండలిలో ఎమ్మెల్సీ పద్మశ్రీ



శాసనమండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ

కాకినాడ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బెదిరింపుల పరిస్థితుల్లో తమను తాము రక్షించుకోవడం లక్ష్యంగా యువతులు, మహిళలకు సాంకేతికతలతో ఆత్మరక్షణ శిక్షణ ఇవ్వాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ కోరారు. బుధవారం శాసనమండలిలో ఆమె మాట్లాడారు. మహిళల భద్రత క్లిష్టమైన సమస్యగా ఉన్న సమాజంలో ఆత్మరక్షణ శిక్షణ కేవలం నైపుణ్యం మాత్రమే కాదు.. అవసరమని తెలిపారు. ఇందుకుగాను ప్రధానమంత్రి శ్రీ ఆత్మరక్షణ పథకం అమలులో ఉందన్నారు. విద్యాసంస్థలు, కార్యాలయాలు, కమ్యూనిటీ సెంటర్లలో నిర్మాణాత్మక స్వీయ రక్షణ శిక్షణ అందించడం ఈ పథకం ఉద్దేశమన్నారు. శారీరక బలం, మానసిక స్థైర్యం, వారి హక్కులపై అవగాహన కల్పించడం మహిళలకు శక్తినిస్తుందన్నారు. మార్షల్ ఆర్ట్స్, పరిస్థితులనుబట్టి చైతన్యం కావడం, వ్యూహాత్మకంగా వ్యవహరించడంపై శిక్షణ ఇవ్వడం వల్ల మహిళలు అవసరమైనప్పుడు తమను తాము రక్షించుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటారన్నారు. అందువల్ల ప్రధానమంత్రి శ్రీ ఆత్మరక్షణ పథకం గురించి రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయడంపై తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ పద్మశ్రీ శాసనమండలిని కోరారు.

పేదరికం లేని సమాజం లక్ష్యంగా పీ4 సర్వే

- సమష్టి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 12(ఆంధ్రజ్యోతి): పేదరికంలేని సమాజ నిర్మాణం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పబ్లిక్,ప్రైవేట్, ప్రజలు పార్టనర్‌షిప్ సర్వేకు రూపకల్పన చేసిందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. తమ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో పీ4 సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పీ4 పాలసీపై ప్రజలు తమ విలువైన అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. ఈనెల 25వ తేదీలోపు స్వర్ణఆంధ్రా లింక్, క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయాలన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం దీనికి సంబంధించిన గోడ పత్రికలను జిల్లా కలెక్టర్, జేసీ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, సీపీవో త్రినాథ్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు తదితర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ప్రజలు, దాతలు, ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రతి ఇంటికి అభివృద్ధి ప్రతి జీవితానికి ప్రగతి చేకూరుతుందన్నారు. పేదల అవసరాలను గుర్తించి, వారి సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పనకు ఈసర్వే దోహదం చేస్తుందన్నారు.

తుస్సుమన్న వైసీపీ యువత పోరుబాట

- కాకినాడ కలెక్టరేట్ ఎదుట వైసీపీ ధర్నా
- కార్యక్రమానికి దూరంగా యువత



కాకినాడలో కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వైసీపీ నేతలు

కలెక్టరేట్(కాకినాడ),మార్చి12(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్ ఎదుట వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన యువత పోరుబాట తుస్సుమంది. ఈ కార్యక్రమానికి యువత, విద్యార్థులు దూరంగా ఉన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు విచ్చేసి కలెక్టరేట్ ఎదుట ధర్నాచేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ జిల్లాఅధ్యక్షుడు దాడిశెట్టి రాజా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయకుండా విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందన్నారు. సకాలంలో ఫీజులు చెల్లించకపోవడంవల్ల విద్యార్థులను కళాశాలలనుంచి ఆయా యాజమాన్యాలు వెళ్లగొడుతున్నాయని ధ్వజమెత్తారు. విద్యారంగాన్ని చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. రూ.3వేల నిరుద్యోగ భృతి చెల్లించడం లేదని విమర్శించారు. వైసీపీహయాంలో రూ.8వేలకోట్లతో 17 వైద్యకళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, వీటిని ఇప్పుడు ప్రైవేటీకరించే కుట్ర చేస్తున్నారన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వంగా గీత, వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, తోట నరసింహం, ఎమ్మెల్సీ అనంత్‌బాబు, సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, యనమల కృష్ణుడు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలకు అదనపు ఆర్థిక సహాయం

- ఎస్సీలు, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు పీవీటీజీలకు రూ.లక్ష
- జిల్లాలో 7,108మందికి చేకూరనున్న లబ్ధి: కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 12(ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థికసాయం అందించనుందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడ కలెక్టర్ కార్యాలయంనుంచి జేసీ రాహుల్‌మీనాతో కలిసి ఆయన గృహ నిర్మాణ పథకంపై బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2029నాటికి అందరికీ ఇళ్లు నిర్మించాలనే దృఢ నిశ్చయంతో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలపూర్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పీఎంఏవై గ్రామీణ్ 1.0, పీఎంఏవై అర్బన్ 1.0లో ఇళ్లు మంజూరై ఇంకా వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు యూనిట్ విలువకు అదనంగా ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉత్తర్వులు జీవో నెం.9 10న విడుదల చేసిందన్నారు. జిల్లాలో 7,108మంది బీసీ, ఎస్సీ, ఎస్టీల గృహాలు వివిధ దశల్లో నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. బీసీలు 4,852, ఎస్సీలు 2,131, ఎస్టీలు 125మంది లబ్ధిదారులు ఉన్నట్లు గుర్తించామన్నారు. గృహ నిర్మాణం పూర్తికి యూనిట్ విలువ రూ.1.80లక్షలకు అదనంగా ఎస్సీలు, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పీవీటీజీలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ మేరకు లబ్ధిదారులు ఇళ్లు పూర్తి చేసుకోవడానికి తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ సత్యనారాయణను ఆదేశించారు. ఈనెల 18నుంచి 25వరకు ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి వారు ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 20 లోగా లబ్ధిదారులకు ఎఫ్‌డీవో జనరేట్ చేయాలన్నారు.

అర్జీదారుల నుంచి నేరుగా ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో దరఖాస్తు చేసిన అర్జీదారులనుంచి నేరుగా ఫీడ్ బ్యాక్ తీసుకుని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు.కాకినాడ కలెక్టర్ కార్యాలయంనుంచి జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల రెవెన్యూ అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో బుధవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో సమస్యల పరిష్కార విధానంపై అర్జీదారులనుంచి నేరుగా అభిప్రాయసేకరణ చేయాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారవ్యవస్థలో 16 విధాలుగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. వాటన్నింటినీ గ్రామ, వార్డు సిబ్బంది వారి లాగిన్‌లోకి వచ్చిన ప్రతి దరఖాస్తుదారుడికి ఫోన్ చేసి వారినుంచి సమయం తీసుకోవాలన్నారు. ఆ సమయానికి వెళ్లి వారినుంచి అభిప్రాయాలను తీసుకుని ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. సోమ,మంగళవారాల్లో డివిజన్‌స్థాయిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ప్రజాభిప్రాయ సేకరణ ఎలా చేయాలనేదానిపై వర్క్‌షాపులు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయి అధికారులు గ్రామస్థాయిలో పనిచేసే అధికారులకు పూర్తిస్థాయిలో అర్థమయ్యేలా క్షుణ్ణంగా ఒక సచివాలయంలో కూర్చుని వివరించాలన్నారు. సమావేశంలో జేసీ రాహుల్ మీనా, డీఆర్వో వెంకట్రావు పాల్గొన్నారు.


ఉప్పాడలో ఎండలో ఆరబెట్టిన చేపలు

చెప్పతరమా... ఉప్పు చేప

ఉప్పుచేప.. పప్పుచారు రుచి మనవాళ్లకు తెలిసినంతగా మరొకరికి తెలీదేమో. తరతరాల నుంచి ఈ కాంబినేషన్‌కు తిరుగేలేదు. పూర్వం సామాన్య కుటుంబాల్లో వండుకోవడానికి ఏమీ లేకపోతే పప్పుచారు కాచి, ఉప్పు చేప వేయిస్తే ఇంటిల్లిపాదీ ఆరోజు భోజనం కార్యక్రమం పూర్తయిపోయేది. అయినా ఉప్పుచేప రుచికి, పప్పుచారుకి లంగరు కుదరడం వల్ల ఇప్పటికీ ఈ రెండూ కలిపి తినాలనే నానుడి స్థిరపడింది. నిజానికి మాంసాహార ప్రియులంతా ఉప్పుచేప తినరు. కానీ ఇటీవల కాలంలో ఉప్పుచేపకు క్రేజ్ అంతకంతకూ పెరుగుతోంది. హోటళ్లలో, వివాహ రిసెప్షన్లు, ఇతర ఫంక్షన్లలో ఉప్పుచేప కలిపి వండే వంటకాలను ప్రత్యేకంగా పెడుతున్నారు. ఉప్పుచేప వంటకాలు ప్రత్యేకమైన రుచిని కలిగి ఉండడంతో ఇవి తినేవాళ్లూ ఎక్కువగానే ఉంటున్నారు. ఈ కొత్త ట్రెండ్ ఎలా వున్నా ఉప్పుచేపలు అత్యధికంగా తయారుచేసే ప్రాంతం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఉప్పాడ కావడం గమనార్హం. సముద్రతీర ప్రాంతాల్లో మత్స్యకారులు ఈ ఉప్పు చేపల ఉత్పత్తితో ఉపాధి పొందుతున్నారు. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు సైతం డ్రైఫిష్ ఉత్పత్తులు ఎగుమతి అవుతుండడం విశేషం.



రుచి చూశారా..
- ఉప్పు చేప, పప్పు చారు
- మాంసాహార వంటల్లో ఇదో ప్రత్యేకం
- హోటళ్లలో, వేడుకల్లో ఇప్పుడొక స్పెషల్ డిష్
- ఉప్పాడలో భారీ స్థాయిలో ఉప్పు చేపల తయారీ
- ఇతర రాష్ట్రాలు, విదేశాలకు సైతం ఎగుమతి
- ఉపాధి పొందుతున్న మత్స్యకార మహిళలు



కొత్తపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ గ్రామం మత్స్య సంపద ఉత్పత్తికి ప్రసిద్ధి. ఉప్పాడ తీర ప్రాంతాలకు చెందిన మత్స్యకార మహిళలు ఐదు దశాబ్దాలకు పైగా ఎండు చేపలను తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఎండు చేపల రవాణాతో ఇక్కడ లక్షల్లో వ్యాపారాలు సాగుతున్నాయి. సముద్రంలో వేటాడి ఒడ్డుకు తెచ్చిన చేపలను అమ్మగా మిగిలిన వాటిని ఉప్పు చేపలుగా తయారు చేస్తారు. వంజరం, కోనం, మాగ, సుదుములు, పండుగప్ప, సంధువా, గొరస, పసుపు పార, మొరాలు, కవళ్లు, నెత్తళ్లు... ఇలా పలు రకాల పచ్చి చేపలను మత్స్యకార మహిళలు రేవులో వేలంలో కొనుగోలు చేస్తారు. వాటిని రెండు పెడలుగా కోసి లోపల పేగులు, సెంకులు తదితర వ్యర్థాలు లేకుండా పూర్తిగా శుభ్రం చేస్తారు. వారం లేదా పదిహేను రోజుల పాటు ఉప్పు కుండీలో ఊరబెట్టిన చేపలను బయటకు తీసి సముద్రం ఒడ్డున ఎండబెడతారు. ఎండిన వంజరం, కోనం, పండుగప్ప చేపలను తట్టాలు అని పిలుస్తారు. ఉదాహరణకు బాగా ఎండిన వంజరం లేక కోనం తట్టాం ఒక్కో చేప రూ.600 నుంచి రూ.1,000 పలుకుతుంది. ఉప్పాడ జాంధానీ చీరల కొనుగోలుకు దూర ప్రాంతాల నుంచి వచ్చే పలువురు ఇక్కడ తయారుచేసే ఎండు చేపల తట్టాలను ఎంతో ఇష్టంగా కొనుగోలు చేస్తుంటారు. ఉప్పులో ఊరేసి ఎండిన చేపలను ముక్కలుగా చేసుకుని డబ్బాల్లో నిల్వ చేసుకుంటారు. ఇంట్లో ఎటువంటి కూర తయారు చేయని పరిస్థితుల్లో ఎండు చేప వేయించుకుని, పప్పుచారు కాసుకొని ఎండు చేప నంజుకు తింటే ఆ రుచే వేరంటారు చేప ప్రియులు. గతంలో సంవత్సరం పాటు ఎండు చేపలను తయారు చేస్తూ వేటకు వెళ్లే మత్స్యకారులకు మహిళలు చేదోడుగా సాయం అందించేవారు. గత ఏడాదిలో సంభవించిన వరుస తుఫాన్లు, అల్పపీడనాలతో మత్స్యకారుల జీవనోపాధికి ఆటంకం ఏర్పడింది.



తీర ప్రాంతాలకు చెందిన మత్స్యకార మహిళలు చేపలు విరివిగా దొరికే ప్రాంతాలకు వెళ్లి పచ్చి చేపలను కొనుగోలు చేస్తారు. వాటిని ఎండు చేపలుగా తయారుచేసిన అనంతరం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ఉప్పాడలో పూర్తి నాణ్యతతో తయారు చేసిన ఎండి చేపలకు ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. ఉప్పాడ తీర ప్రాంత గ్రామాలైన సుబ్బంపేట, కొత్తపేట, రంగూన్‌పేట, సూరాడపేట, రామిశెట్టిపేట, మాయాపట్నం, అమీనబాద్, మూలపేట, పొన్నాడ, కోనపాపపేట, తొండంగి మండలాల్లోని పలు తీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకార మహిళలు ఎండు చేపలను తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వేట విరామంలో సుమారు 61 రోజుల పాటు ఎండు చేపల విక్రయం ద్వారానే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. కేరళ, బెంగళూరు, కోల్‌కతా, చెన్నయ్ నగరాలకు లారీల ద్వారా ఉప్పాడ ఎండు చేపల ఎగుమతి జరుగుతోంది.

నెత్తళ్లు, మాగ చేపల్లో పోషక విలువలు

సముద్రంలో లభ్యమయ్యే నెత్తళ్లు, మాగ, వంజరం వంటి చేపల్లో మంచి పోషకాలు లభిస్తాయని పెద్దలు చెప్తున్నారు. పచ్చి, ఎండు నెత్తళ్లను బాలింతలకు పత్యంగా పెడతారు. మాగ, సుదుములు, కోనం తదితర పచ్చి చేపల్లో మెటాబాలిమ్ విలువలు మెండుగా ఉంటాయని వైద్యులు చెప్పడం గమనార్హం.

● ఉప్పాడ నుంచి విదేశాలకు ఎగుమతి

కొత్తపల్లి మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో అధికంగా తయారు చేసిన ఎండు చేపలను తాటాకు బుట్టల్లో ప్యాక్ చేసి ఇతర రాష్ట్రాలకు లారీల్లోను.... పండుగప్పలు, వంజరం లాంటి ఎండు చేపలను విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేయడం ద్వారా విదేశీ మారకద్రవ్యాన్ని కూడా ఆర్జిస్తున్నారు తీర ప్రాంత మత్స్యకారులు. ఉప్పాడ పరిసర, శివారు గ్రామాలకు చెందిన కేవలం నాలుగైదు కుటుంబాల మత్స్యకారులు నెలకు సుమారు 2 నుంచి 3టన్నుల ఎండు చేపలను తయారు చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు.

ప్లాట్‌ఫారాలు నిర్మించాలి

ఉప్పు చేపలను తొట్టెలోంచి తీసిన తర్వాత ప్లాట్‌ఫారాలపై ఎండిబెడితే మంచి నాణ్యత ఉంటుంది. సముద్రం ఒడ్డున ఇసుకలో బరకాలు వేసి ఆరబెట్టిన చేపలు అంతగా నాణ్యత ఉండదు. నాణ్యత కలిగిన ఎండు చేపలను తయారు చేసేందుకు, ప్రత్యేకంగా ఆరబెట్టేందుకు తీర ప్రాంత గ్రామాల్లో ప్లాట్‌ఫారాలు, ర్యాక్‌లు నిర్మించాలని మత్స్యకార మహిళలు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

డ్రైఫిష్‌తో స్పెషల్ డిష్!

ఎండు చేపలు, రొయ్యల వంటకాలపై పెరిగిన మక్కువ
ప్రత్యేక వంటకాలతో ఘుమఘుమలు



రావులపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎండు చేపలు తినడం అందరికీ ఇష్టం ఉండదు. దీనికి వండేటప్పుడు వచ్చే వాసన కారణం కావొచ్చు. కానీ వండిన తర్వాత దీని రుచికి అలవాటు పడినవారు మాత్రం ఆహా అనకమానరు. ఇళ్లలో మాత్రమే ఎండుచేపలు, ఎండురొయ్యలతో ఏదైనా కలుపుతో వండుకునేవారు. ఇటీవలి కాలంలో సరికొత్త రుచుల వేటలో హోటళ్లలోను, వేడుకల్లోను ఎండు చేపలు, ఎండు రొయ్యలతో చేసిన వంటకాలను వేడివేడిగా వడ్డించేస్తున్నారు. ఎండు చేపలు ప్రత్యేక రుచిని కలిగి ఉండడంతో వీటిని తినేవాళ్ల సంఖ్య కూడా పెరుగుతోంది. సాధారణంగా చేపలు పేరు వినగానే ఘుమఘుమలాడే మసాలా వాసనతో వివిధ రకాల దినుసులతో తయారుచేసే చేపల పులుసు గుర్తుకొస్తుంది. కానీ ఇప్పుడు ఎండు చేపల వంటకాలపైనా మాంసాహారప్రియులు మక్కువ చూపడంతో వాటికి డిమాండు పెరిగింది. సీఫుడ్ వంటకాలపై ఆసక్తి ఉన్నవారంతా అందుబాటులో ఉండే ఈ డ్రైఫిష్‌లతో సరిపెట్టుకుంటున్నారు. దాంతో వాటి విక్రయ దుకాణాలు విరివిగా పెరుగుతున్నాయి. జాతీయ రహదారుల చెంతనే ఎండు చేపల దుకాణాలు వెలుస్తుండడంతో స్థానికులతో పాటు దూర ప్రాంతాలకు వెళ్లే వాహనచోదకులు ఆగి వాటిని కొనుగోలు చేస్తున్నారు. చిక్కుడు ఎండుచేప, మామిడికాయ ఎండుచేప, ఎండుచేప వంకాయ పులుసు, నెత్తళ్ల వంకాయ కోడి గుడ్డు, బీరకాయ నెత్తళ్లతోపాటు వివిధ రకాల కూరగాయల్లో ఎండుచేపలను విరివిగా వినియోగించి పసందైన కూరలు వండి వడ్డిస్తున్నారు. ఒకప్పుడు సముద్ర తీర ప్రాంత గ్రామ మార్కెట్లలో మాత్రమే లభ్యమయ్యే ఎండుచేపలు ప్రస్తుతం ప్రతి ప్రాంతంలోనూ అందుబాటులోకి రావడంతో వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు.

పోషకాలూ ఉన్నాయ్..

ఎండు చేపలు తినడం వల్ల విటమిన్-డి, అయోడిన్, ఖనిజాలు, ప్రొటీన్లు, యాంటీఆక్సిడెంట్లు, పొటాషియం, తదితర పోషకాలు శరీరానికి పుష్కలంగా అందుతాయని మాంసాహార ప్రియులు చెప్తున్నారు. పచ్చి నెత్తళ్లు కానీ, ఎండు నెత్తళ్లను బాలింతలకు పత్యంగా పెడతారు. పండుగొప్ప, వంజరం, మాఘ, నెత్తళ్లు, కొయ్యింకలు, సందువా, కట్టిపరిగెలు, శాకరొయ్యి, రొయ్యిపొట్టు, పప్పురొయ్యలు, సావిడాయలు, కూన చేపలు, కానగంత, గొరసలు, కోనాం చేపలు, శంకు రొయ్యలు, జల్లితట్టువాలు, రామలు, ఇసుక దొందులు, చీరమేను, తెల్లరొయ్యలు, బల్లపరుగులు, చప్పిడి సావిడాయిలు, కొరివాప రిగెలతోపాటు పలు రకాల ఎండు చేపలు దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయి. వీటిని దుకాణదారులు కాకినాడ, విశాఖపట్నం, పండి, పొర, నాగాయలంక, అంతర్వేది, బందరు, నర్సాపురం, ఉప్పాడ తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తెచ్చి విక్రయిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండల పరిధిలోని గౌతమి వంతెన వద్ద నుంచి వశిష వంతెన వరకు విస్తరించి ఉన్న జాతీయ రహదారి పొడవునా సుమారు 12కుపైగా దుకాణాలు ఉన్నాయంటే వీటికి డిమాండ్ ఎంత పెరిగిందో అర్థం చేసుకోవచ్చు.

ఎండు చేపలకు డిమాండు

ఎండుచేపల కొనుగోలుదారులు పెరగడంతో వాటికి డిమాండ్ పెరిగింది. 30కుపైగా రకాలతో ఎండుచేపల దుకాణం ఏర్పాటు చేసుకున్నాను. నిత్యం స్థానికులతో పాటు వాహనాల్లో దూర ప్రాంతాలకు వెళ్లే వారు ఆగి వీటిని కొనుగోలు చేస్తున్నారు. మాంసాహారప్రియుల ఆహార అలవాట్లకు అనుగుణంగా ఇతర ప్రాంతాల నుంచి ఎండు చేపలను తీసుకొచ్చి విక్రయాలు సాగిస్తున్నాం.

కుసుమే రాంబాబు (ఏసు)
ఎండు చేపల వ్యాపారి, గోపాలపురం


రావులపాలెం మండలం గోపాలపురంలో హైవే పక్కన ఎండు చేపలు విక్రయిస్తున్న రాంబాబు

హనుమంత వాహనంపై నరసన్న విహారం

కోరుకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా 3వ రోజు బుధవారం కోరుకొండ తీర్థం చూసేందుకు భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు కొండ పైన, దిగువన నరసింహస్వామిని దర్శించుకున్నారు. వారందరికీ దేవస్థానం అర్చకులు సర్వదర్శనం కల్పించారు.

నరసింహుడి సదస్యం

నరసన్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఆలయ ముఖ మండపంలో అన్నవరం దేవస్థానం వేద పండితులు, ఉభయ వేదాంత పండితులు సమక్షంలో అర్చకులు సదస్యం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదిక ఆశీనులను చేశారు. అనంతరం కొందరు పండితులు అమ్మవారి వంశ గొప్పతనాన్ని, మరి కొందరు నరసింహస్వామి వంశ గొప్పతనాన్ని వివరించారు. మంగళాశాసనం చేశారు. కార్యక్రమంలో ఉభయ వేదాంత పండితులు పరాసర లక్ష్మీనరసింహ భట్టర్, పరాసర రంగరాజ భట్టర్, పరాసర రఘునాథ భట్టర్, ఈవో వీర్ల సుబ్బారావు, ఉత్సవాల ముఖ్య అధికారి చంద్రశేఖర్, ఇతర అధికారులు వాసు, రాంజీ, సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, కటకం అన్నపూర్ణ, బది రెడ్డి దొర, కూటమి నాయకులు పాల్గొన్నారు.


హనుమంత వాహనంపై నరసింహస్వామి గ్రామోత్సవ దృశ్యం

వైభవంగా కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

ఆంజనేయ వాహనంపై గ్రామోత్సవం

నరసన్న కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 9గంటలకు ఆంజనేయ వాహనంపై నరసింహస్వామి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. స్వామివారి సదస్యం అనంతరం అర్చకులు స్వామివారిని ప్రత్యేక పల్లకిలో ఆశీనులను చేసి వేదమంత్రాలతో తోడ్కొని వచ్చి ఆంజనేయ వాహనంపై ఉంచారు. అనంతరం ప్రత్యేక పూజలు, మంగళహారతులు, నివేదనలు అందించారు. తదుపరి మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అలాగే స్వామివారి కళావేదికపై కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు. శ్రీ రంగరాజస్వామి ఆలయ ప్రాంగణంలో విశిష్ట అద్వైత పండిత సభలు జరిగాయి.

నేటి కార్యక్రమాలు

- ఉదయం కొండ పైన, దిగువున నరసన్న ఆరాధన, సర్వ దర్శనం, సేవాకాలం
- రాత్రి 7.30గంటలకు రంగనాథ స్వామి ఆలయంలో కల్యాణం, కళావేదికపై కూచిపూడి నృత్యం
- 8గంటలకు గజవాహనంపై నరసింహస్వామి గ్రామోత్సవం
- ధర్మసత్రంలో భక్తులకు ఉదయం, సాయంత్రం అన్నదానం
- రంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం, సాయంత్రం పండిత సభలు


నరసింహుడికి సదస్యం నిర్వహిస్తున్న పండితులు

భద్రతపై అలసత్వాన్ని సహించం: రైల్వే జీఎం

- » రాజమహేంద్రవరం, సామర్లకోట, కాకినాడ స్టేషన్లను తనిఖీ చేసిన ఉన్నతాధికారి
- » అమృత్ భారత్ పథకంలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై ఆరా
- » అధికారులు, సిబ్బందికి సూచనలు


ట్రాలీపై వెళ్తూ రోడ్‌కంరైలు బ్రిడ్జిని పరిశీలిస్తున్న జీఎం

రాజమహేంద్రవరం/సామర్లకోట/కాకినాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): భద్రతా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ చిన్న అలసత్వానికి కూడా వీల్లేదని, ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ స్థానిక అధికారులకు స్పష్టం చేశారు. విజయవాడ డివిజన్‌లో భద్రతా తనిఖీల్లో భాగంగా ఆయన, ఉన్నతాధికారుల బృందంతో కలిసి రాజమండ్రి, సామర్లకోట, కాకినాడ రైల్వే స్టేషన్లను తనిఖీ చేశారు. బుధవారం ప్రత్యేక రైలులో రాజమండ్రి రైల్వేస్టేషన్‌కి చేరుకుని అమృత్ భారత్ పథకంలో రూ.273 కోట్లతో చేపట్టనున్న రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా తూర్పు రైల్వేస్టేషను ప్రాంగణం, ప్రస్తుతం ఉన్న భవనాలను పరిశీలించారు. ప్లాన్ ప్రకారం అక్కడ నిర్మించే భవనాలు, రోడ్డు వెడల్పు, ప్రయాణి కుల సదుపాయాలు, ట్రాక్ తదితర మార్పులపై విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ.పాటిల్ జీఎంకు వివరించారు. తర్వాత పశ్చిమ వైపు ప్రాంగణానికి చేరుకొని అక్కడ ఏమేమి మార్పు రాబోతున్నాయో తెలుసుకున్నారు. ప్రయాణికుల సదుపాయాలు, సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని చూశారు. క్రూలాబీ చేరుకొని భద్రతా పరమైన అంశాలపై అక్కడి సిబ్బందికి కౌన్సెలింగ్ చేశారు. రైల్వే స్టేషను అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రాధాన్యాలపై పలువురు ప్రజా ప్రతినిధులు ఆయనకు వినతిపత్రాలు సమర్పించారు. ఆపై ప్రత్యేక రైలులో వెళ్లి రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద ఆగారు. అక్కడి నుంచి సుమారు 3 కిలోమీటర్ల మేర ట్రాలీపై వెళుతూ బ్రిడ్జిని, ట్రాక్ పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు.

అలాగే రైల్వే జీఎం సామర్లకోట చేరుకుని రైల్వేస్టేషన్లో రూ.25.37 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వివిధ అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ప్లాట్‌ఫాం 1,2,3లలో జరుగుతున్న పనులను పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రతా చర్యల్లో భాగంగా సిగ్నలింగ్ వ్యవస్థలో పనిచేస్తున్న వివిధ హోదాల అధికారులను, సిబ్బందిని జీఎం ప్రశ్నించారు. అంతకు ముందు సామర్లకోట చేరుకున్న జీఎంకు స్థానిక రైల్వే సూపరింటెండెంట్ ఎం.రమేష్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు.

అలాగే జీఎం అరుణ్‌కుమార్ జైన్ కాకినాడలోని టౌన్, పోర్టు రైల్వే స్టేషన్లకు చేరుకుని రెస్ట్ రూమ్‌లు, రన్నింగ్ రూమ్‌లు ప్లాట్‌ఫాంలను పరిశీలించారు. అమృత్ భారత్ పథకంలో జరుగుతోన్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే ట్రాక్‌లైన్ పనులు పరిశీలించి, త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోర్టు స్టేషన్లో రన్నింగ్ రూమ్ ఎదుట మొక్క నాటారు.


కాకినాడ టౌన్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న రైల్వే జీఎం

ప్రేమను పంచండి... ద్వేషించవద్దు

తాటిపర్తిలో సందేశాత్మకంగా నాటక పోటీలు


భౌ..భౌ..భౌ నాటకంలో ఓ సన్నివేశ దృశ్యం

గొల్లప్రోలు రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కని పెంచిన పిల్లలు ప్రేమలో పడగానే ద్వేషించవద్దు. శత్రువులుగా చూసి వారిపై తీసుకునే చర్యలు జీవితంలో మాయలేని మచ్చగా మిగిలిపోతాయి. అదే సమయంలో కని పెంచిన తల్లిదండ్రులను విస్మరించి ప్రేమలో పడి వారికి తెలియకుండా వివాహం చేసుకోవడం సరైన పద్ధతి కాదంటూ సందేశాన్ని ఇస్తూ భౌ..భౌ..భౌ నాటకం సాగింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళా వేదికపై అపర్ణా నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకాల పోటీల్లో నాలుగో రోజున రాజమహేంద్రవరం కందుకూరి వీరేశలింగం కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన ఈ నాటకం అందరినీ ఆలోచింపజేసింది. కుమార్తె తక్కువ కులం వాడిని ప్రేమించిందని ఆమెను చంపిన తల్లిదండ్రుల తీరుని తప్పుపడుతూ మనుషుల కంటే కుక్క తదితర జంతువులే ఎక్కువ ప్రేమాభిమానాలు కలిగి ఉంటాయని వివరించారు.

వైసీపీ విమర్శలను ధీటుగా ఎదుర్కొంటా: సోము


సోము వీర్రాజుకు గజమాల వేస్తున్న పార్టీ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ప్రభుత్వంపై అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని, వారి విమర్శలను శాసనమండలిలో కూటమి సభ్యుడిగా ధీటుగా ఎదుర్కొంటామని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా నామినేషన్ వేసి బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరం వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు ఆయన కార్యాలయం వద్ద ఘనస్వాగతం పలికాయి. ఈ సందర్భంగా సోము మీడియాతో మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు ఇప్పటికే ఎంపీ పురందేశ్వరి రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారని, సాంస్కృతికశాఖ మంత్రి దృష్టికి అన్ని విషయాలను తీసుకెళ్లారన్నారు. గోదావరి జలాల ప్రక్షాళన కూడా మొదలవుతుందని, వచ్చే ఐదేళ్లలో దీనిపై ఖర్చు చేసేందుకు కేంద్రం రూ.400 కోట్లు కేటాయించిందని సోము పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రేలంగి శ్రీదేవి, బొమ్ముల దత్తు, అడబాల రామకృష్ణ, హారిక, వీరాంజనేయులు పాల్గొన్నారు.

పాదగయలో ఎమ్మెల్యేల పూజలు


పాదగయ క్షేత్రాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యేలు

పిఠాపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని పలువురు ఎమ్మెల్యేలు బుధవారం సాయంత్రం సందర్శించారు. ప్రభుత్వ విప్‌లైన తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీని వాస్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, హోటల్స్ 'ఎన్' గ్రూపు అధినేత నారా శేషు పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. వారికి వేద పండితులు క్షేత్రప్రాశస్త్యం వివరించి ఆశీర్వచనాలు ఇచ్చారు. ఎమ్మెల్యేలను ఈవో కేజే శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు అందజేశారు.



మంచు కురిసే వేళలో..


యానాంలో పంట పొలాలపై పొగ మంచు




మండపేట, అనపర్తిలో మంచు దృశ్యాలు

అమ్మమ్మను ఇంటి వద్ద దింపి వస్తుండగా...

అన్నదమ్ముల మృతి


సాంబశివ (ఫైల్‌ఫొటో)


వీరేంద్ర (ఫైల్‌ఫొటో)

గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మరణం

ఐ.పోలవరం మండలం బాలయోగి బ్రిడ్జిపై ఘటన

ఐ.పోలవరం/ముమ్మిడివరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తమ ఇంట్లో జరిగే శుభకార్యానికి వచ్చిన అమ్మమ్మను తిరిగి వాళ్లింటి దగ్గర దింపేందుకు మోటారుసైకిల్‌పై వెళ్లిన అన్నదమ్ములు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం బాలయోగి బ్రిడ్జిపై మంగళవారం రాత్రి ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. ఐ.పోలవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లరేవు మండలం సుంకరపాలెనికి చెందిన ఎల్లా వీరేంద్ర(17), ముమ్మిడివరం మండలం కొత్తలంక గ్రామానికి చెందిన వేమవరపు సాంబశివ (14) వరుసకు అన్నదమ్ములు అవుతారు. వీరేంద్ర కొత్తలంకలో బంధువుల ఇంటి వద్ద ఉంటున్నాడు. వారిద్దరు వీరేంద్ర అమ్మమ్మను సుంకరపాలెంలో దింపి బైక్‌పై తిరిగి వస్తుండగా యానాం బ్రిడ్జిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఇద్దరికి తలపై బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బుధవారం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఐ.పోలవరం ఎస్‌ఐ ఆర్.మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. వేమవరపు ఏసురాజు-గంగాభవానీ దంపతుల చిన్న కుమారుడు సాంబశివ 9వ తరగతి చదువుతున్నాడు. మోటారుసైకిల్‌పై సాంబశివ, వీరేంద్ర అమ్మమ్మను దింపి తిరిగి వస్తుండగా మృత్యువాతకు గురవ్వడంతో తల్లిదండ్రులు రోదిస్తున్నారు.

సుంకరపాలెంలో విషాదచాయలు

తాళ్లరేవు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఐ.పోలవరం మండలం బాలయోగి బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదంలో కాకినాడ జిల్లా సుంకరపాలెం యువకుడు ఎల్లా వీరేంద్ర మృతిచెందడంతో ఆ గ్రామంలో విషాదచాయలు అలము కున్నాయి. వీరేంద్ర మినీ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుండగా తండ్రి సూరిబాబు తాపీమేస్త్రి, తల్లి రాముడు గృహిని, చెల్లి సిరి 9వ తరగతి చదువుతుంది.

హింసాత్మక దాడికి పాల్పడిన నలుగురి అరెస్ట్


కాకినాడ రూరల్: పోలీసులతో నిందితులు

కాకినాడ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): హింసాత్మక దాడికి పాల్పడిన నలుగురు నిందితులను సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ పి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. కాకినాడ జిల్లా కాకినాడ గొడారిగుంటలోని వినాయక వైన్‌షాప్ వద్ద ఇద్దరు వ్యక్తులు మద్యం తాగేందుకు వచ్చి చిన్న విషయంపై గొడవపడిన సంఘటన హింసాత్మకంగా మారింది. అయితే ఉద్దేశ్యపూర్వకంగానే నిందితులు బీర్‌బాటిళ్లతో దాడి చేసి తీవ్రమైన గాయాలు చేశారన్నారు. దీంతో అదే ప్రాంతానికి చెందిన నిందితులు సీకోటి రాజు, పెయ్యల ప్రసాద్, సీకోటి ప్రసాద్, కలాడి అర్జునరావులపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. కేసుపై విచారణ కొనసాగుతోందని, చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని వారిని కస్టడీకి తరలించినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పేలుడు పదార్థాలతో దాడికి పాల్పడిన ముగ్గురి అరెస్టు

ద్రాక్షారామ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ద్రాక్షారామలో పేలుడు పదార్థాలతో దాడికి పాల్పడిన కేసులో ఇద్దరు మైనర్లతో సహా మరో వ్యక్తిని బుధవారం ద్రాక్షారామ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వెలంపాలెం రైల్వే క్రాసింగ్‌గేటు వద్ద పోతురాజు వినీల్‌కుమార్ మరో ఇద్దరు మైనర్లను ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్ అరెస్టు చేశారు. మైనర్లను రాజమహేంద్రవరం జువైనల్ కోరుకు తరలించారు. వినీల్‌కుమార్‌ను రామచంద్రపురం కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు.

కాకినాడలో పేలుడు ఘటనలో

తీవ్ర గాయాలైన వ్యక్తి మృతి


మద్దిలేటి (ఫైల్‌ఫొటో)

కాకినాడ క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈ నెల 3న జరిగిన పేలుడు ఘటనలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ డైరీఫారం సెంటర్‌కు చెందిన గజ్జిల మద్దిలేటి (38) వార్ఫ్ రోడ్డు సమీపంలోని కమర్షియల్ రోడ్డులో ఉన్న జై బాలాజీ ట్రాన్స్‌పోర్ట్‌లో జట్టు కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 3న విధుల్లో భాగంగా హైదరాబాద్ నుంచి వచ్చిన లారీలోని పార్శిల్ దింపుతున్నారు. అందులో ఒకటి ఉల్లిపాయ (గోడ) బాంబుల పార్శిల్ కావడంతో ఒక్కసారిగా పెద్ద శబ్ధంతో విస్ఫోటనం జరిగి మద్దిలేటితో పాటు మరో నలుగురు హమాలీలు గాయాలపాలయ్యారు. పార్శిల్ దింపుతున్న మద్దిలేటికి శరీరం 50 శాతం కాలిపోయింది. కాకినాడ జీజీహెచ్‌లోని బర్న్స్ వార్డులో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతిచెందాడు. కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో

మండపేట యువకుడి మృతి

మండపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణం కొండపల్లి వారి వీధికి చెందిన పి.జితేంద్ర (33) మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కటుంబసభ్యులు వివరాల ప్రకారం... జితేంద్ర బతుకుతెరువు కోసం మహారాష్ట్రకు వెళ్లి అక్కడ ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్నాడు. ఈనెల7న ఫైనాన్స్ పని మీద ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఉద్గావ్‌లో హల్నీ రహదారిపై గుడ్స్ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అక్కడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. జితేంద్ర మృతితో మండపేటలో విషాదచాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని అక్కడ నుంచి అంబులెన్స్‌లో తీసుకొచ్చి మండపేటలో అంత్యక్రియలు చేశారు.

రావులపాలెంలో కంటిపూడి షోరూమ్ ప్రారంభం

రావులపాలెం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రావులపాలెంలో కంటిపూడి అధికృత డీలర్ నూతన శాటిలైట్ డీలర్‌షిప్‌ను బుధవారం ప్రారంభించారు. సంస్థ రీజనల్ మేనేజర్ శివరామకృష్ణ కంటిపూడి గ్రూప్ మేనేజింగ్ డైరక్టర్ కటంమనేని వినయ్‌బాబు ప్రారంభించి మాట్లాడుతూ వినియోగదారులు మెరుగైన సేవలందించేందుకు అత్యాధునిక ఆటోమెటిక్ పరికరాలు కలిగిన వర్క్‌షాపును రూపొందించామన్నారు. కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వరాయుడు, ఎం.జగన్, సీహెచ్.సత్యనారాయణమూర్తి, కె.మన్మోహన రావు, సేల్స్ ఆర్‌ఎం శివరామకృష్ణ, జీఎం రాజారావు, బ్రాంచ్ మేనేజర్ వంశీ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి బుధవారం రాజమహేంద్రవరానికి చెందిన ఎం.రామాంజనేయులు రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందించారు. దాతను అభినందించి, వారికి స్వామివారి ప్రత్యేకదర్శనం కల్పించి ప్రసాదం అందించారు. సత్యదేవుడి జన్మ నక్షత్రం మఖ సందర్భంగా బుధవారం మూలవరులకు జన్మనక్షత్ర పూజలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. పూర్ణాహుతి గావించారు.


పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

రేపు జనసేన ఆవిర్భావ సభ సందర్భంగా..

216 హైవేపై ట్రాఫిక్ మళ్లింపు



పిఠాపురం మండలం చిత్రాడలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు మనోహర్, దుర్గేష్


పిఠాపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారులో ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో ఈనెల 14న జరిగే జనసేన ఆవిర్భావ సభను దృష్టిలో ఉంచు కుని శుక్రవారం కాకినాడ-కత్తిపూడి మధ్య గల 216వ జాతీయరహదారిపై ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. ఆ రోజు ఉదయం 11 నుంచి రాత్రి 11గంటల వరకూ కార్యక్రమాలు జరగనుండటం, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తదితరులు హాజరవుతున్న నేపథ్యంలో భద్రతా కారణాల రీత్యా ఆ రోజు ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నట్టు కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ బుధవారం తెలిపారు. సభ వద్ద ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాలను జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, మంత్రులతో కలిసి పరిశీలించిన అనంతరం ఈ విషయాన్ని తెలిపారు.

సభకు వచ్చేవారికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

మంత్రులు మనోహర్, దుర్గేష్

జనసేన ఆవిర్భావ సభకు వచ్చేవారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పిఠాపురం మండలం చిత్రాడ శివారు ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో 14న జనసేన ఆవిర్భావ సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సగిలి షాన్మోహన్, ఎస్పీ బిందుమాధవ్‌లతో కలిసి వారు బుధవారం రాత్రి పరిశీలించారు. హెలిప్యాడ్, ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. సభకు వచ్చేవారు నేరుగా సభా ప్రాంగణంలోని వచ్చేలా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. వారి వెంట కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, జనసేన నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.




వాహనాల మళ్లింపు మార్గాల మ్యాప్‌లు

ట్రాఫిక్ మళ్లింపు ఇలా...

కాకినాడ, కోనసీమ జిల్లాలు నుంచి విశాఖపట్టణం(వయా కత్తిపూడి) వెళ్లే వాహనాలు కాకినాడ-ఇంద్రపాలెం వంతెన, కెనాల్ రోడ్డు, సామర్లకోట, కిర్లంపూడి, ప్రత్తిపాడు మీదుగా ఎన్‌హెచ్-16కి మళ్లిస్తారు

విశాఖపట్టణం నుంచి కాకినాడ, కోనసీమ జిల్లాలుకు వచ్చే వాహనాలు కత్తిపూడి నుంచి ప్రత్తిపాడు, కిర్లంపూడి, సామర్లకోట, కాకినాడ(కెనాల్‌రోడ్డు)మీదుగా మళ్లిస్తారు.

విశాఖపట్టణం-చెన్నై మధ్య కాకినాడ జిల్లా మీదుగా ఎన్‌హెచ్-16పై ప్రయాణించే వాహనాలు యధావిధిగా వెళ్లవచ్చు

వాహనాల పార్కింగ్‌కు 9 ప్రదేశాలు

వివిధ ప్రాంతాల నుంచి సభకు తరలివచ్చేవారి వాహనాల పార్కింగ్ కోసం చిత్రాడ పరిసర ప్రాంతాల్లో 9ప్రాంతాలను గుర్తించారు. కాకినాడ వైపు అయిదు, పిఠాపురం వైపు నాలుగు పార్కింగ్ ప్లేసులు ఏర్పాటు చేశారు.

పార్కింగ్ స్థలాలకు ఇలా వెళ్లాలి

పార్కింగ్ ప్రదేశాలు 1(ఏ,బీ,సీ,డీ,ఈ)లకు గుంటూరు జిల్లా, తెనాలి, కృష్ణా, పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ తదితర జిల్లాల నుంచి వచ్చే వాహనాలు ఉప్పలంక బైపాస్, చీడిగ, ఇంద్రపాలెం, కెనాల్‌రోడ్డు, సామర్లకోట, 3 లైట్ల జంక్షన్, ముత్తా గోపాలకృష్ణ ఆర్వోబీ, సర్పవరం, అచ్చంపేట జంక్షన్ మీదుగా చిత్రాడ సభాస్థలానికి చేరుకోవాలి.

పార్కింగ్ ప్రదేశాలు 2(ఏబీసీడీ)లకు ఉత్తరకోస్తా జిల్లాలు విశాఖ, అనకాపల్లి, ఏఎస్‌ఆర్ తదితర జిల్లాల నుంచి కత్తిపూడి, పిఠాపురం మీదుగా సభా ప్రాంగణానికి చేరుకోవాలి.

తూర్పుగోదావరి జిల్లా, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల నుంచి వాహనాలు ఏడీబీ రోడ్డు, రాజానగరం, రంగంపేట, సామర్లకోట, పిఠాపురం మీదుగా సభా ప్రాంగణానికి చేరుకోవాలి.

ఏలూరులో లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 12 మందికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రుల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావాసులు


లారీని ఢీకొన్న బస్సు

ఏలూరు క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కేంద్రం ఏలూరు సమీపంలో బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగి 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. కాకినాడ నుంచి గుంటూరుకు మంగళవారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్సు బయలుదేరింది. బుధవారం తెల్లవారు జామున 4.30 గంటల ప్రాంతంలో ఏలూరు మెయిన్ బైపాస్ రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ఆయిల్ డబ్బాల లారీని వెనుక నుంచి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో 12 మందికి గాయాలయ్యాయి. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ముగ్గురికి పళ్లు ఊడిపోయాయి. ప్రమాద సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు ఏలూరు 108 అంబులెన్సు సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రులు ఇట్టి సత్యసాయి (కాకినాడ), కర్రి హారిక (రావుల పాలెం), వెల్ల రాజు (మాచవరం), కడియం రామశివుడు (కాకినాడ), కొర్ల సుబ్రహ్మణ్యం (కాకినాడ), కొత్తల వెంకట లక్ష్మి(రామచంద్రపురం), కఠారి శిరీష్ (కాకినాడ), ఆరేపల్లి సాయిదుర్గ ప్రసాద్ (తణుకు), వడిత దత్తు నాయక్ (మాచర్ల), జిగిలింగ పవన్‌కుమార్ (కాకినాడ), ఆకుల శేషు (కడియపులంక), రూపేంద్ర గాంధీలు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్, త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, ఎస్‌ఐ రాంబాబు పరామర్శించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లారీలోని 2 ఆయిల్ డబ్బాలు పగిలిపోవడంతో ఆ ప్రాంతమంతా ఆయిల్ పడిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. క్రేన్లతో లారీ, బస్సును రోడ్డు పక్కకు తీయించి వాహనాల రాకపో కలకు అంతరాయంలేకుండా చర్యలు తీసుకున్నారు.

బాధితులకు సాయం అందించే ప్రయత్నం

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ డిపో నుంచి మంగళవారం రాత్రి 12.55కి గుంటూరు బయలుదేరిన సూపర్‌లగ్జరీ బస్ ఏలూరు సమీపంలో ప్రమాదానికి గురైంది. ఈ బస్సులో మొత్తం 26మంది ప్రయాణిస్తున్నారు. వారిలో 12మందికి తీవ్ర గాయాలు కాగా ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారికి ఆర్టీసీ అధికారులు చికిత్స నిమిత్తం రూ.5వేలు ఇవ్వడానికి ప్రయత్నించినా కొంతమంది తిరస్కరించి అవసరంలేదని చెప్పి వెళ్లిపోయినట్టు కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ తెలిపారు.

గొల్లపాలెంలో సల్ఫర్ గ్యాస్ లీక్

తొమ్మిది మందికి అస్వస్థత


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మలికిపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గొల్లపాలెం పంచాయతీ కేశనపల్లి జీజీఎస్‌లో గ్యాస్ లీక్‌తో ప్రజలు ఆందోళన చెందారు. ప్రతీ రెండు సంవత్సరాలకొకసారి పైపులైన్లను శుభ్రపరిచే ప్రక్రియలో భాగంగా బుధవారం మధ్యాహ్నం నైట్రోజన్ యాసిడ్, అమ్మోనియా, సల్ఫర్ వాయువులతో శుద్ధి చేస్తుండగా పైపులైన్ పిన్ వాల్వ్ లీకవడంతో గ్యాస్ లీకేజీ ప్రభావం పరిసరాలపై పడింది. కొంత మందికి శ్వాస ఆడకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. ఈ ప్రక్రియలో ఎ.పవన్, ఫణీంద్ర, శ్రీనివాస్, ప్రదీప్, రమేష్‌కుమార్ అస్వస్థతకు గురి కాగా పవన్‌ను మెరుగైన చికిత్స కోసం భీమవరం తరలించారు. సల్ఫర్ వాయువు బయటకు వ్యాపించడంతో సరీన్, తిరుమల వెంకటలక్ష్మి అనే ఇద్దరు అస్వస్థతకు గురయ్యారు. వారికి స్థానిక వైద్య సిబ్బంది వైద్యసేవలు అందించారు. సంఘటనా స్థలానికి ఆర్డీవో కె.మాధవి హుటాహుటిన వచ్చారు. ఓఎన్జీసీ అధికారులతో ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పిన్‌వాల్వ్‌ను లీకేజీని 15 నిమిషాల్లో అదుపు చేసినప్పటికీ ఆ ప్రభావం 2 గంటలసేపు ఉంటుందని అధికారులు తెలిపారు. బాధితులను ఆర్డీవో పరామర్శించారు. వారి వెంట రాజోలు సీఐ నరేష్‌కుమార్, తహశీల్దార్ శ్రీనివాస్‌లు ఉన్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

అప్పులు తీర్చలేక గడ్డి మందు తాగి

కౌలు రైతు ఆత్మహత్య


వెంకటేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

తాళ్లరేవు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామానికి చెందిన కౌలు రైతు పెచ్చేటి వెంకటేశ్వరరావు(45) అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వెంకటేశ్వరరావు తన సొంతభూమితో పాటుగా మరికొంత కౌలు పొలం సాగుచేస్తూ పంట నష్టం రావడంతో అప్పుల పాలయ్యాడు. అప్పులు తీరక కొంతకాలం వ్యవసాయం వది లేసి జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు పనికివెళ్లాడు. ప్రస్తుతం కాకినాడలో కూలిపని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం యానాం బీచ్‌కు వెళ్లి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేశ్వరరావును యానాం పోలీసుల సాయంతో కాకినాడలో ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. మృతదేహానికి యానాంలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య నాగలక్ష్మి, కుమార్తెలు శ్రీదేవి, జ్యోతిశ్రీలు ఉన్నారు. ఈ సంఘటనతో పత్తిగొందిలో విషాదచాయలు అలముకున్నాయి.

ఉమ్మడి జిల్లా పరిషత్ రూ.886 కోట్ల

బడ్జెట్‌కు ప్రభుత్వ ఆమోదం

పంచాయతీరాజ్ శాఖ నుంచి ఉత్తర్వులు

రంపచోడవరం/కాకినాడ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లా పరిషత్‌లకు సంబంధించి ఆయా జిల్లా పరిషత్‌ల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ 2024-25 బడ్జెట్ అంచనాలను రూ.886 కోట్ల మేరకు ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ వివరాలిలా ఉన్నాయి. 2022-23లో వాస్తవ రాబడి రూ.44.37 లక్షలు ఉండగా, వాస్తవ వ్యయం రూ.54.47 లక్షలుగా ఉంది. 20 23-24 సవరించిన అంచనాలైతే రాబడిగా రూ.883 కోట్లు కాగా, వ్యయాన్ని రూ.882 కోట్లుగా చూపారు. ఇక 2024-25 బడ్జెట్ అంచనాలకు సంబంధించి రాబడిని రూ.886 కోట్లుగా చూపితే, వ్యయాన్ని కూడా రూ.886 కోట్లుగా చూపి అంచనా ప్రతిపాదనలను జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి ప్రభుత్వానికి పంపించగా పలు షరతులతో ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. జరిపిన వ్యయాలకు సంబంధించి కచ్చితమైన లెక్కలను ఆధారాలతో చూపాలని, బడ్జెట్‌లో ఎస్సీలకు, ఎస్టీలకు ఆయా జనాభా ప్రాతిపదికన కేటాయించాల్సిన నిధుల వ్యయానికి సంబంధించి స్పష్టమైన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. అంతే కాకుండా జిల్లా పరిషత్ స్థాయిలో ఐదేళ్ల వార్షిక ప్రణాళికలను జిల్లా ప్రణాళికా చట్టం ప్రకారం సిద్ధం చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

15న పి.గన్నవరంలో పవర్ లిఫ్టింగ్ పోటీలు


పోటీల ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పి.గన్నవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ ఫిట్నెస్ జోన్ ఐదో వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 15న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో యునైటెట్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్‌ప్రెస్- 2025 పోటీలు జరగనున్నాయి. కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అండ్ ఎస్ఎస్ ఫిట్నెస్ జోన్ సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న ఈ పోటీల ట్రోఫీలను పోతవరంలో బుధవారం స్థానిక ఎస్‌ఐ బి.శివ కృష్ణ ఆవిష్కరించారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంకిపాటి వెంకటేశ్వరావు మాట్లాడుతూ పోటీలకు అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. 3విభాగాల్లో మొత్తం 10 కేటగిరీల్లో మెన్ 53, 59, 66, 74, 83, 93 కేజీల మాస్టర్స్ విభాగం, మహిళలకు 63 లోపు, ఆపైన కేజీల్లో పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు నగదు పురస్కారాలతో పాటు మెరిట్ సర్టిఫికెట్, మెడల్, నేషనల్‌షీల్డ్‌లను అందిస్తామన్నారు. ఈవెంట్ ఆర్గనైజర్ కత్తుల శ్రీనివాసు, నల్లా పెద్దకాపు, చికిలే తరుణ్, తోలేటి వంశీకృష్ణ, బొరుసు రాజబాబు, నందుల సన్నీ,తోలేటి రాజా పాల్గొన్నారు.

10 కాసుల బంగారం, రూ.5 లక్షలు చోరీ

ఉండ్రాజవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో 10 కాసులు బంగారం, రూ.5లక్షలు నగదు దోచుకెళ్లారు. ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపిన వివరాలు ఇల్లా ఉన్నాయి. ఉండ్రాజవరంలోని నిమ్మతోటలో ఉంటున్న సీసాని చిరంజీవి, అతడి భార్య సీపాని విజయలక్ష్మి మంగళవారం ఉదయం ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లారు. ఈ నెల 29న వారి కుమారుడు నరేష్ పెళ్లి సందర్భంగా రూ.5లక్షలు నగదు బీరువాలో దాచారు. అదేవిధంగా 10 కాసుల బంగారం బీరువాలో ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనుక గేటు నుంచి వచ్చి తలుపులు పగుల గొట్టి బెడ్‌రూమ్‌లోని బీరువా పగుల గొట్టి రూ.5లక్షలు నగదు, 10కాసులు బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. విజయలక్ష్మి ఇంటికి వచ్చి చూడగా తలుపులు తీసి ఉండటం, బెడ్‌రూమ్ బీరువాలో తెరిచి ఉండటంతో పోలీసులకు విజయలక్ష్మి ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలాన్ని సీఐ తిలక్, ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు పరిశీలించారు. క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

చోరీకి గురైన 53 సెల్‌ఫోన్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లతో డీఎస్పీ రఘువీర్, సీఐలు, ఎస్‌ఐలు

ద్రాక్షారామ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం సబ్‌డివిజన్ పరిధిలో చోరీకి గురైన సెల్‌ఫోన్లు రికవరీకి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి రూ.5 లక్షలు విలువైన 53 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ బి.రఘువీర్ తెలిపారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో వివిధ పోలీస్‌స్టేషన్లు పరిధిలో ఫిర్యాదుల ఆధారంగా దర్యాప్తు చేశామన్నారు. 53 సెల్‌ఫోన్లను యజమానులకు డీఎస్పీ అందజేశారు. సీఐలు ఎం.వెంకట నారాయణ, దొరరాజు, సురేష్, ఎస్‌ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

మైనర్‌ను మోసగించిన వ్యక్తిపై పోక్సో కేసు

రాజవొమ్మంగి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగికి చెందిన చిత్తారపు రాంబాబు అనే వ్యక్తి ఇంటర్మీడియట్ చదువుతున్న ఒక మైనర్‌కు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. దీనిపై ఈనెల 11న మైనర్ తల్లి ఇచ్చిన మేరకు రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్‌లో బీఎన్ఎస్, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రాజవొమ్మంగి సీఐ ఎన్.సన్యాసినాయుడు తెలిపారు. ఎస్‌ఐ నరసింహమూర్తి,పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్: మంత్రి నాదెండ్ల



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న మనోహర్

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు నిలుస్తున్నాయని, రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.630 కోట్లు పంపిణీ చేశామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. కాకినాడ కుళాయిచెరువు కళాక్షేత్రంలో కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన 20మంది పేదలకు రూ.24లక్షలను చెక్కుల రూపంలో బుధవారం ఆయన అందజేశారు. అనంతరం మూడు చక్రాల సైకిళ్లు, వినికిడి మిషన్లు పంపిణీ చేశారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, నాయకులు తలాటం సత్య, చోడిశెట్టి శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.



ఏపీ టిడ్కో చైర్మన్ అజయకుమార్‌తో మాజీ ఎమ్మెల్యే దొరబాబు

చరిత్రలో నిలిచేలా జనసేన ఆవిర్భావ సభ

పిఠాపురం రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చరిత్రలో నిలిచేలా జనసేన పార్టీ ఆవిర్భావ సభ జరగబోతోందని ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్ తెలిపారు. పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిత్రాడలో నిర్వహించే ఈ సభకు 10లక్షల మంది జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, ప్రజలు తరలివస్తారని చెప్పారు. వివిధ రాష్ట్రాలు నుంచి సభకు వస్తున్నట్టు ఫోన్లు వెల్లువలా వస్తున్నాయని తెలిపారు. సభకు ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పష్టంగా చెప్పారని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గ ప్రజలు పవన్‌పై చూపిన ప్రేమాభిమానాలకు కృతజ్ఞతగా ఈ సభను జరిపి వారికి అంకితం చేస్తామని చెప్పారు. జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఆవిర్భావ సభ సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు. కాగా వేములపాటి అజయకుమార్‌ను బుధవారం పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిఠాపురం మండలం చిత్రాడలో శుక్రవారం జరిగే జయకేతనం మహా సభపై విస్తృత ప్రచారం నిర్వహించామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ అర్బన్ అథారిటీ చైర్మన్ తుమ్మల రామస్వామి పేర్కొన్నారు. సామర్లకోట ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం నుంచి సామర్లకోట, పెద్దాపురంలలో ప్రచారం చేశారు. పరిశీలకులు కిరణ్ ప్రసాద్, మంచెం సాయిబాబు, పొలమరశెట్టి సత్తిబాబు, కొప్పిరెడ్డి నాగబాబు, చిన్నం వెంకన్న, చినబాబు, జానకి రామారావు, పెంకే వెంకటలక్ష్మి, భూమల విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రమేష్

'పది' పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం పెంచాలి'

కాకినాడ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని మరింతపెంచాలని డీఈవో పి.రమేష్ కోరారు. రమణయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో బుధవారం జరిగిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం విద్యా ర్థులను ఎక్కువ సంఖ్యలో చేర్పుకునేందుకు కృషి చేయాలన్నారు. శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు కె.గాయత్రి, ఇన్‌చార్జి శ్రీనివాస్, సీఆర్పీలు, 150 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తహసీల్దార్లకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

'రెవెన్యూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'

కాకినాడ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు పేర్కొన్నారు. బుధవారం ఆయన డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్దేశించిన మండలాల్లో రీ సర్వేను సమగ్రంగా నిర్వహించాలన్నారు. ఇళ్ల స్థలాల విషయమై పూర్తిస్థాయి విచారణ చేసి నివేదిక రూపొందించాలన్నారు. తహసీల్దారు కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన దరఖాస్తులపై నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్వోఆర్, పీవోటీ ఆక్రమణ కేసులకు సంబంధించి ఓఆర్‌సీఎంఎస్ వెబ్‌సైట్‌లో పాత, కొత్త కేసులు పొందుపరచాలన్నారు. దీనిపై పూర్తిస్థాయి అవగాహన పొందేందుకు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లకు శిక్షణ ఇచ్చామన్నారు. ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి డీబీఏ చైనులు, తహసీల్దార్లు వి.జితేంద్ర, పి.త్రినాథరావు, జీఆర్ ఠాగూర్, కె.చిన్నారావు, కె.సత్యనారాయణ, కె.చంద్రశేఖరరెడ్డి, ఎన్.సత్యనారాయణ, రాంకుమార్, ఎస్ఎల్ఎన్ కుమారి, డిప్యూటీ తహసీల్దార్లు కృష్ణసౌజన్య, రామచంద్రారెడ్డి, గోవిందు పాల్గొన్నారు.

'కోస్తా, కొవ్వూరు-భద్రాచలం రైలు మార్గాల

నిర్మాణాలు వెంటనే చేపట్టాలి'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అన్నవరం నుంచి తొండంగి మండలంలో నిర్మాణంలో ఉన్న గేట్‌వే పోర్టుకు కాకినాడ పోర్టును కలుపుతూ వెంటనే రైలు మార్గం వేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌కు తూర్పు గోదావరి జిల్లా, కోకనాడ ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు, జడ్ఆర్‌యూసీసీ సభ్యుడు వైడీ రామారావు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్లో జీఎంను కలిశారు. తద్వారా నర్సాపురం వరకు రైలు మార్గం ఏర్పడుతుందన్నారు. నర్సాపురం నుంచి మచిలీపట్నం, రేపల్లె, నిజాంపట్నం కలుపుతూ బాపట్ల వరకు కోస్తా రైలు మార్గం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, దీంతో తీర ప్రాంతాల్లోని ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. కొవ్వూరు-భద్రాచలం రోడ్డు రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలని కోరారు. కాకినాడ నుంచి వారాణసి మీదుగా న్యూఢిల్లీ, జోధ్‌పూర్, కోల్‌కతాలకు నూతన రైళ్లు ప్రవేశపెట్టాలని కోరారు.

దుకాణాలు ఖాళీ చేయాలి: కమిషనరు కనకారావు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలోని మార్కెట్ ఆవరణలో నగర పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని కమిషనరు కనకారావు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని దుకాణదారులు అందరూ ఖాళీ చేయాలని, వారికి రాజు చెరువు వద్ద ఖాళీ స్థలాన్ని మార్కెట్ కోసం కేటాయిస్తామని చెప్పారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో మార్కెట్‌లోని దుకాణదారులతో బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. దుకాణదారులు కోర్టుకు వెళ్లినా ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపించమని చెప్పిందని తెలిపారు. మార్కెట్‌లో కార్యాలయ భవనం నిర్మాణం కోసం గతంలోనే ఆదేశాలు వచ్చాయని చెప్పారు. దుకాణదారులు అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో టీపీవో నీలిమాదీప్తి, ఏఈ ప్రభాకర్, మేనేజరు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభ సమన్వయ కమిటీలో

'సూరంపూడి'కి చోటు

తాళ్లరేవు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభను ఘనంగా నిర్వహించేందుకు పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్తగా తాళ్లరేవుకు చెందిన సూరంపూడి కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు తనకు పార్టీ అధిష్ఠానం నుంచి ఉత్తర్వులు వచ్చాయని కుమార్ తెలిపారు.





దీపం పథకం లబ్ధిదారురాలితో మాట్లాడుతున్న మంత్రి మనోహర్, రచ్చబండలో సమస్య చెప్తున్న మహిళ

కిలో బియ్యానికి రూ.46.10 పైసలు ఖర్చు చేస్తున్నాం

ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోండి... పండూరు 'రచ్చబండ'లో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

కాకినాడ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కిలో బియ్యానికి రూ.46.10 పైసలు ఖర్చు చేస్తోందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. కాకినాడ రూరల్ మండలం పండూరులో బుధవారం సాయంత్రం నిర్వహించిన రచ్చబండలో ఆయన పాల్గొన్నారు. తొలుత ఎండీయూ ఆపరేటర్ ఎ.చిట్టిబాబు పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించారు. గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. పించన్ల మంజూరు, డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం, పండూరు చెరువును బాగు చేయడంతో పాటు చుట్టూ వాకింగ్ ట్రాక్, శ్మశానవాటిక, తమ్మవరం భూముల వంటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి మాట్లాడుతూ పండూరులోని 1,834 గృహాలకు గాను 1,682 బియ్యం కార్డుదారులు దీపం-2 పథకం కింద నూటికి నూరు శాతం లబ్ధి పొందుతున్నారన్నారు. మహిళల భద్రత విషయంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. గ్రామంలోని మహిళలతో మాట్లాడి పండూరును ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామన్నారు. రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే రచ్చబండ నిర్వహించామన్నారు. గ్రామంలో మూడు సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని, మూడు స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్లను మంత్రి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు 500 కుట్టుమిషన్లు గ్రామానికి వచ్చాయని తెలిపారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కుడా చైర్మన్ తుమ్మల బాబు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు దేవులానాయక్, డీఎస్‌వో సత్యనారాయణరాజు, సర్పంచ్ వి.అమ్మాజీ, ఎంపీటీసీ అనంతలక్ష్మి, ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సతీష్, తహసీల్దారు కుమారి, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తాటిపర్తిలో టెన్త్ పరీక్షా కేంద్రం ఏర్పాటు

నెరవేరిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీ



గొల్లప్రోలు రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతంలో పరీక్షా కేంద్రం ఉండాలన్నది అక్కడి విద్యార్థుల కల. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉండిపోయిన ఈ డిమాండ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో నెరవేరింది. అక్కడ కేంద్రం ఏర్పాటు చేస్తూ విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దశాబ్దాల కాలంగా కోరుతున్నారు. గొల్లప్రోలు వెళ్లి పరీక్ష రాయాల్సి రావడంతో వ్యయప్రయాసలకు గురయ్యేవారు. పరీక్షలు జరిగే అన్ని రోజులూ 8 కిలోమీటర్లు ప్రయాణం చేసి గొల్లప్రోలు పరీక్షా కేంద్రానికి చేరుకోవడం, తిరిగి ఇంటికి చేరుకునేందుకు వారుపడే అవస్థలు అన్నిఇన్నీ కావు. బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలపైనే ఆధారపడి ప్రయాణాలు సాగించాల్సి రావడంతో విద్యార్థులు ఇంటికి వచ్చేవరకూ వారి కోసం తల్లిదండ్రులు ఎదురుచూపులు చూశారు. వన్నెపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 12 కిలోమీటర్లు, కొడవలి ఉన్నత పాఠశాల విద్యార్థులు 15కిలోమీటర్లు వెళ్లి పరీక్ష రాయాల్సి రావడం ఇబ్బందికరంగా ఉండేది. తాటిపర్తి, వన్నెపూడి, చినజగ్గంపేట, కొడవలి, చెందుర్తి గ్రామాల తరగతి విద్యార్థులకు సౌకర్యంగా ఉండేందుకు తాటిపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఇటీవల పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి వచ్చింది. వెంటనే ఇక్కడ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయన విద్యాశాఖాధికారులను ఆదేశించారు. దీంతో గొల్లప్రోలు పట్టణంలోని మూడు పరీక్షా కేంద్రాలకు అదనంగా తాటిపర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్షా కేంద్రం ఏర్పాటు చేస్తూ విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ 245 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. తమ ఇబ్బందులను తెలుసుకుని తాటిపర్తిలో పరీక్షా కేంద్రం ఏర్పాటుకు చొరవ తీసుకున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఐదు గ్రామాల పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

సామర్లకోట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి సేకరించే చెత్త నుంచి ఘన వ్యర్థాల నిర్వహణ ద్వారా చెత్త నుంచి సంపద తయారీ అంశాలపై సామర్లకోట మండలం జి.మేడపాడులోని ఎస్‌డబ్ల్యుపీసీ శిక్షణా కేంద్రంలో బుధవారం కాకినాడ డీఎల్పీవో కార్యాలయ ఏవో వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. సామర్లకోట, పెద్దాపురం మండలాల ఈవోఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో వివిధ అంశాలను రిసోర్స్‌పర్సన్లు సమగ్రంగా వివరించారు. శిక్షణార్థులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. కాగా రెండు మండలాల ఎంపీడీవోలు గైర్హాజరు కావడం గమనార్హం.

యువ కవితా పోటీలు

కాకినాడ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా రచయితల సంఘం, వేణుగోపాల సంస్కృత ప్రచారసభల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 30న యువ కవితా పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.చిరంజీవినీకుమారి తెలిపారు. నవవసంతం-నవమానవుడు అనే అంశంపై 35ఏళ్ల లోపు వయస్సు గల యువ కవులు తమ కవితలను జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షులు మాకినీడి సూర్యభాస్కర్ 9491504045 నెంబర్‌కి వాట్సాప్‌లో పంపించాలన్నారు. ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులను ఇవ్వడమే కాకుండా ఎంపికైన 10 మంది కవులతో కవిసమ్మేళనం జరుగుతుందని తెలిపారు. 98667 33293 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా సత్తెమ్మతల్లి జాతర

కిర్లంపూడి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాజుపాలెంలో శ్రీసత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, గంధం ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ గొడే దొరబాబు, పోకల దొరబాబు, సూరిబాబు అమ్మవారిని దర్శించుకున్నారు.

వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

పిఠాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను నీరుగార్చిందని కాకినాడ మాజీ ఎంపీ, వైసీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్ విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద బుధవారం వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. వైసీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మోటారు సైకిళ్లపై ర్యాలీగా కాకినాడ తరలివెళ్లారు.

'ఫీజు పోరు' యాత్ర

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో యువతకు విద్యా ప్రోత్సాహకాలను నిలిపివేడంపై వైసీపీ నేతలు నిరసన తెలిపారు. ఆ పార్టీ పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో సామర్లకోట ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం వద్ద నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు మోటారు సైకిళ్లపై ప్రదర్శనగా కాకినాడ కలెక్టరేట్‌కు తరలివెళ్లారు.



హెచ్‌ఎంకు కుర్చీలు అందజేస్తున్న వేళంగి లయన్స్ క్లబ్ సభ్యులు

వేళంగి హైస్కూలుకు కుర్చీల వితరణ

కరప, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వేళంగి మెర్లాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ సభ్యులు రూ.82వేలు విలువచేసే 100 కుర్చీలను బహూకరించారు. స్థానిక హైస్కూల్‌లో బుధవారం వాటిని హెచ్‌ఎంకు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.కామేశ్వరరావు హార్ట్ స్ట్రోక్‌కు గురైనవారికి సీపీఆర్ చేసే విధానాన్ని విద్యార్థులకు ప్రయోగపూర్వకంగా వివరించారు. వేళంగి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చుండ్రు వెంకన్నరాయచౌదరి అధ్యక్షతన డాక్టర్ బొండా వెంకన్నరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బాదం బాలకృష్ణ, లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ బొండా సూర్యారావు, ఇళ్ల ఆదేష్, మెర్ల రాజేంద్రప్రసాద్, బొడ్డు భాస్కరరామన్, బొండా చంటిబాబు, హెచ్‌ఎం భారతి, సత్యానందం మాస్టారు, గరగ జెమ్మి (అప్పి) తదితరులు పాల్గొన్నారు.



అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్‌కు వినతిపత్రం ఇస్తున్న పారిశుధ్య కార్మికులు

జీజీహెచ్ పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాలి

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో సుదీర్ఘకాలంగా విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికులకు నెలసరి వేతనాలను పెంపుదల చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు బుధవారం ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారిలకు వినతిపత్రాలు అందజేశారు. సీఐటీయూ నగర సహ కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరారు. సూపరింటెండెంట్ స్పందిస్తూ.... కార్మికుల డిమాండ్లను డీఎంఈ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

వర్కర్స్ యూనియన్ నాయకులు సీహెచ్ విజయకుమార్, జె.శేషు, లక్ష్మీప్రియ, రాయుడు రమేష్, వాసు, మంగతాయారు, పుష్ప, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి భూమి పూజ

పెద్దాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నెలవారీ వైద్యం కోసం దూర ప్రాంతాల నుంచి పెద్దాపురం ఆసుపత్రికి వస్తున్న గర్భిణీలకు ప్రతి బుధవారం మన పెద్దాపురం గ్రూప్ వారు పౌష్టికాహార భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. వారు భోజనం చేసేటప్పుడు ఎండ తగిలి ఇబ్బందిపడుతుండంతో షెడ్డు నిర్మాణానికి పూనుకున్నారు. దీనికి పెద్దాపురం దేవి సీఫుడ్స్ లిమిటెడ్ ప్రతినిధులు సహాయ సహకారాలు అందిస్తున్నారు. షెడ్డు నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో దేవి సీఫుడ్స్ కంపెనీ ప్రొడక్షన్ మేనేజరు అనిల్, ప్రభుత్వాస్పత్రి గైనకాలజిస్ట్ జగదాంబ, డాక్టర్ శ్రీనివాస్, హెడ్ నర్స్ రమాదేవి, హెచ్‌డీఎస్ మెంబర్ సంజీవ్‌కుమార్, స్టాఫ్ నర్స్ ఎస్వీ రమణ, మన పెద్దాపురం గ్రూప్ సభ్యులు లక్ష్మణ్, నవీన్, నాని, వేములు చంద్రశేఖర్, సత్యప్రశాంత్, జయశ్రీ, రత్నం, లక్ష్మి పాల్గొన్నారు.



వైభవంగా వెంకన్న ఊంజల్ సేవ

పిఠాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెంకన్న ఊంజల్‌సేవ బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం చతుః స్థానార్చన, బలి, స్నపన తిరుమంజనం జరిగాయి. రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊయల్లో ఉంచి వేదపండితులు వింజామరలు విసురుతు ఊంజల్‌సేవ జరిపించారు. టీటీడీ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సందీప్, అధికారులు పాల్గొన్నారు.

మనుషులు రాగద్వేషాలను

విడనాడాలి

ఆధ్యాత్మికవేత్త రాధామనోహరదాసు



సామర్లకోట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మనుషులంతా ప్రాపంచిక విషయాలపై రాగద్వేషాలను విడిచిపెట్టి భగవంతుణ్ణే కొలవాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రాధా మనోహరదాసు కోరారు. వేట్లపాలెంలో రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఆయన భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. ప్రాంతాలవారీగా, కులాలవారీగా, పార్టీలవారీగా విడిపోవద్దని విజ్ఞప్తి చేశారు. ధర్మం కోసం అందరూ కలిసుండాలన్నారు. ప్రతిఒక్కరూ సమాజం పట్ల, ఇతరుల పట్ల అవలంబించాల్సిన పద్ధతులను సమగ్రంగా వివరించారు. వేట్లపాలెం వెంకన్న ఆలయ వ్యవస్థాపకుడు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో మనోహర దాసును ఘనంగా సత్కరించారు.

వీల్ చైర్ అందజేత

కాకినాడ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బోన్ షుగర్ వ్యాధితో బాధపడుతూ తీవ్ర అస్వస్థతకు గురై శస్త్ర చికిత్స ద్వారా రెండు కాళ్లు కోల్పోయిన పేద కుటుంబానికి చెందిన గాంధీనగర్ ప్రాంతవాసి ముద్దా మంగకు ప్రభుత్వం ద్వారా బుధవారం వీల్ చైర్ అందజేశారు. ఆర్థిక స్తోమత లేని ఆమె కుటుంబ సభ్యులు ప్రభుత్వం ద్వారా వీల్ చైర్ ఇప్పించాలని 41వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతివెంకట్‌ను కోరారు. వారు ఈ విషయాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు దృష్టికి తేగా ప్రభుత్వం ద్వారా వీల్ చైర్ ఇప్పించారు.

ఈ-శ్రమ్ కార్డుతో ప్రయోజనాలెన్నో

కాకినాడ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ్ కార్డు ద్వారా ప్రయోజనాలు పొందాలని... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అమలు చేస్తున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్మిక శాఖ సహాయ కమిషనరు ఎన్.బుల్లిరాణి, మల్లాడి రామారావు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మల్లాడి రాజేంద్రప్రసాద్ కోరారు. ఈ-శ్రమ్ కార్డు ప్రయోజనాలను వివరిస్తూ రూపొందించిన ప్రచార పోస్టర్‌ను కార్మిక శాఖ కార్యాలయం వద్ద వారు ఆవిష్కరించారు. కార్యాలయ ఉద్యోగులు ప్రసన్న, రావు, వంశీకృష్ణ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడి సేవలో ఎమ్మెల్యే చినరాజప్ప

మోపిదేవి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా మోపిదేవి గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామిని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బుధవారం దర్శించుకున్నారు. నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చకులు ఆశీర్వదించారు. పర్యవేక్షకులు మధుసూదనరావు స్వామి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

గ్లకోమా పరీక్షలు

కాకినాడ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ గ్లకోమా దినోత్సవం సందర్భంగా బుధవారం టుటౌన్ నూకాలమ్మ గుడి వద్ద గల వాసన్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా గ్లకోమా కంటి పరీక్షలు నిర్వహించారు. స్పెషలిస్ట్ డాక్టర్ అడపా శ్రీమోనిక మాట్లాడుతూ ఈ వ్యాధిని ముందుగానే పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 15 వరకు ఉచితంగా కంటి పరీక్షలు చేస్తామని బ్రాంచి మేనేజరు స్వామి తెలిపారు. డాక్టర్ మణిమాల, డాక్టర్ శ్యామ్ సేవలందించారు.

'ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి'

శంఖవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): శంఖవరం ఏపీ ఆదర్శ పాఠశాలలో ఇంటర్‌లో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కృష్ణవేణి కోరారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఈ నెల17వ తేదీ నుంచి మే 22 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి

● ఇంజనీరింగ్ అధికారులకు ఐటీడీఏ పీవో సింహాచలం ఆదేశాలు

రంపచోడవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మన్యంలో తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశించారు. బుధవారం ఐటీడీఏలో ఆయా శాఖల ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. ఆయా గ్రామాల్లో ఉన్న తాగునీటి బోర్లను, వాటర్ ట్యాంకులను, మంచినీటి పథకాలను క్రమబద్ధీకరించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రతి మండలంలోనూ కంట్రోలు రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో అన్ని మండలాల ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

మన్యంలో గిరిజనేతరులకు పక్కా గృహాలు మంజూరు చేయాలి

● గిరిజన చట్టాలకు భంగం కాకుండా ఇవ్వాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే మిరియాల శిరీష

రంపచోడవరం, మార్చి12(ఆంధ్రజ్యోతి): మన్యంలో 40 శాతంగా ఉన్న గిరిజనే తరులకు గిరిజన హక్కులకు భంగం వాటిల్లకుండా పక్కా గృహాలను మంజూరు చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మంగళవారం అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రంపచోడవరంలోని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. 1952 పూర్వం నుంచి ఇక్కడ మన్యంలో గిరిజనేతరులు ఉన్నారని, వారికి కూడా ఇక్కడ పక్కా గృహాల ఏర్పాటుకు వెసులుబాటు కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. కొన్ని వందల సంవత్సరాలుగా మన్యంలో గిరిజనులు, గిరిజనేతరులు అన్నదమ్ముల మాదిరిగా కలిసి ఉన్నందున, గిరిజన చట్టాలకు భంగం వాటిల్లకుండా గిరిజనేతరులకు న్యాయంచేయాలని కోరారు. ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన తీరుపట్ల గిరిజనేతర వర్గాల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

గిరిజనేతరులకు ఇళ్ల కేటాయింపు సరైంది కాదు

రంపచోడవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మన్యంలో గిరిజనేతరులకు ఇళ్లు కేటాయించాలంటూ రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అసెంబ్లీలో కోరడం సరైంది కాదంటూ మన్యంలోని పలు ఆదివాసీ సంఘాలు పేర్కొన్నాయి. ఈమేరకు బుధవారం ఆయా సంఘాల నాయకులు వేర్వేరుగా ప్రకటనలు జారీ చేశారు. తక్షణం ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడిన మాటలను వెనక్కు తీసుకోవాలని ఆదివాసీ జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు కత్తుల ఆదిరెడ్డి, నాయకులు కుంజం అగ్గిదొర, న్యాయ సలహాదారులు విండెల సామయ్య, పరిశక ప్రకాశరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు తీగల బాబూరావు, నాయకులు మోడిద నూకరాజు, ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి తదితరులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గిరిజనేతరులకు ఇళ్ల నిర్మాణం చట్ట విరుద్ధం

దేవీపట్నం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ ప్రాంతంలో గిరిజనేతరులకు ఇళ్ల నిర్మాణం చట్ట విరుద్ధమని ఆదివాసీ జేఏసీ నాయకులు అన్నారు. బుధవారం మండలంలోని ఇందుకూరు1లో జరిగిన సమావేశంలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి గిరిజనేతరులకు పక్కా గృహాలు మంజూరు చేయాలన్న వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కారం రామన్నదొర, యలగాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ప్రమాదంపై విచారణ జరిపి న్యాయం చేయండి

● రంపచోడవరం డీఎస్పీకి బాలుడి తల్లి ఫిర్యాదు

వై.రామవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బైక్ ప్రమాదంలో తన కుమారుడు కర్రా జశ్విక్‌రెడ్డి మృతికి కారణమైన చవిటిదిబ్బలకు చెందిన ఒలిరెడ్డి మాధవ్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ పెదఊలెంపాడు గ్రామానికి చెందిన కర్రా నాగదేవి, గ్రామస్తులు రంపచోడవరం డీఎస్పీకి చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదులో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 8న తన భర్త స్వామిరెడ్డి, కుమారుడితో కె.యర్రగొండ నుంచి పెద ఊలెంపాడు వస్తుండగా చిన ఊలెంపాడు జంక్షన్ వద్ద తల్లీబిడ్డ అంబులెన్స్ వెనుక నుంచి వెళుతుండగా చవిటిదిబ్బలు నుంచి ఎదురుగా బైక్‌పై వస్తున్న మాధవ్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. దీంతో తన కుమారుడు అక్కడికక్కడే మరణించారని ఆమె తెలిపారు. మాధవ్ తన బైక్‌ను రేగడిపాలెంలో దాచి పెట్టాడని గ్రామస్తులు దాన్ని పట్టుకున్నారన్నారు. గ్రామంలోని రాయివరపు లక్ష్మణరావు మరుసటి రోజు వై.రామవరం ఎస్ఐకు ఈ విషయాన్ని తెలియపరిచారని ఎస్ఐ వస్తారని ఎదురు చూసి కుమారుడికి అంత్యక్రియలు పూర్తి చేశామన్నారు. పోలీస్‌స్టేషన్‌కి వెళ్లామని తన భర్తను భయాందోళనకు గురిచేసి స్టేషన్‌లో తెల్లకాగితంపై సంతకం తీసుకున్నారని దీనిపై విచారణ చేపట్టి తనకు న్యాయంచేయాలని ఆ ఫిర్యాదులో కోరారు.


మృతి చెందిన బాలుడు జశ్విక్‌రెడ్డి(ఫైల్)

శిశు మరణాలపై సమీక్ష

మోతుగూడెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చింతూరు డివిజన్‌లో బుధవారం జరిగిన శిశు మరణాలపై సమీక్షించేందుకు ప్రత్యేక వైద్య బృందం గూడూరు గ్రామాన్ని సందర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య మార్గదర్శకత్వంతో మోతుగూడెం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌లు డాక్టర్ ప్రజ్ఞ, డాక్టర్ నఫియా, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు హాజరయ్యారు.


వైద్య అధికారుల బృందం

అష్టలక్ష్మీ యాగానికి ఏర్పాట్లు సిద్ధం

ఎటపాక, మార్చి 12(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసం ఉష్ణగుండాల సమీపంలో చేపడుతున్న అష్టలక్ష్మీ యాగానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు యాగ నిర్వాహక కమిటీ తెలిపింది. అష్టలక్ష్మీ పీఠంనకు చెందిన పీతాంబరం రఘునాధాచార్యులు, నిర్వాహక కమిటీ సభ్యులు వాటి వివరాలు తెలిపారు. గురువారం రోజున అంకురార్పణ, శుక్రవారం అగ్నిప్రతిష్టలతో యాగం ప్రారంభమవుతుందని చెప్పారు. సాయంత్రం అభిషేకాలు, అర్చనలు, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అష్టాక్షరీ జీయర్‌స్వామి, దేవనాథ జీయర్ స్వామి, అహోబిలం స్వామిఆయా కార్యక్రమాల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. తొలిరోజున అష్టలక్ష్మీ అమ్మవార్ల శోభాయాత్రను నిర్వహించారు. భద్రాచలంలోని శాంతినగర్ నుంచి ప్రారంభమై జీయర్ మఠంవరకు చేరుకుని, అక్కడి నుంచి అష్టలక్ష్మీ పీఠానికి శోభాయాత్రను చేపట్టారు.

అటవీశాఖ బీట్ ఆఫీసర్ మృతికి నివాళి

దేవీపట్నం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వి.రామన్నపాలెం గ్రామానికి చెందిన కోట్ల పరిమిరెడ్డి కుమార్తె శ్రీదేవి అటవీశాఖలో బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.

ఆమె అకాల మృతి విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్ ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు.


అటవీశాఖ బీట్ ఆఫీసర్ శ్రీదేవి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

మందుబాబులకు నిలయంగా ఉన్నత పాఠశాల!

తొండంగి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తొండంగి ఉన్నత పాఠశాల మందుబాబులకు నిలయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొండంగి ఉన్నత పాఠశాలకు ఎంతో చరిత్ర ఉంది. వినోభాబా, జయప్రకాష్ నారాయణ్ వంటి వారితో సంపర్కం ఉన్న ప్రముఖ గాంధేయ వాది నందిగం నాగశ్రీహరి వంటి వారు విద్యాబోధన చేసిన పాఠశాల నేడు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది, బుధవారం ఉదయం పాఠశాల ఆవరణలోను, వరండా పైనా ఖాళీ మందుసీసాలు కనిపించాయి. దీనిని చూసి ఆవేదన చెందిన పలువురు విద్యార్థులు విద్యనభ్యసించే ప్రాంతంలో జరుగుతున్న ఇటువంటి కార్యకలాపాలను తక్షణం నిలుపుదల చేయాలని, దీనిపై ఉన్నతాధికార్లు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పాఠశాల ఆవరణ, వరండాలో ఉన్న బీరు బాటిల్స్

రోడ్డు పనుల అడ్డగింత


పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ తోట రవి

కిర్లంపూడి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాజుపాలెం గ్రామం నుంచి వీరవరం వెళ్లే రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈపనులను స్థానికులు ఆపేందుకు ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ తోట రవి, తోట గాంధీ అక్కడకు చేరుకుని సైట్‌ఇంజనీర్ శ్రీనుతో మాట్లాడి పరిశీలించారు. స్థానికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణం చేయడంతో ఇబ్బంది తొలగింది. వైసీపీ ప్రభుత్వంలో అధ్వానంగా తయారైన రోడ్లను కూటమి ప్రభుత్వం వచ్చాక పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు ఎంపీపీ రవి పేర్కొన్నారు. కార్యక్రమంలో గంధం ఈశ్వరరావు, పోకల దొరబాబు, మాజీ ఎంపీటీసీ గొడే దొరబాబు, సూరిబాబు ఉన్నారు.

రాజుపాలెంలో ఘనంగా సత్తెమ్మతల్లి జాతర

కిర్లంపూడి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం గ్రామంలో శ్రీసత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలను ఘనంగా ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. బుధవారం ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, గంధం ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ గొడే దొరబాబు, పోకల దొరబాబు, సూరిబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏలేశ్వరంలో ఆర్టీసీ కార్మికుల ఆందోళన

ఏలేశ్వరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ రమణ 1/2019 సర్క్యులర్‌ను ఉల్లంఘించినందుకు టిక్కెట్ విలువకు పదిరెట్లు జరిమానా విధించాలి కానీ సస్పెండ్ చేయాల్సిన అవసరం లేదంటూ ఆర్టీసీ కార్మికులు బుధవారం ఆందోళనకు దిగారు. సమగ్ర విచారణ చేసి కుటుంబ సభ్యులతో కౌన్సిలింగ్ ఇప్పించి డ్రైవర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. జేఏసీ నేతృత్వంలో రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ యూనియన్ సభ్యులు సంయుక్తంగా డిపో గేటు వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎర్ర రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. రమణను విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. డిపో కార్యదర్శి యాబీఎం కుమార్, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎస్వీ రావు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

'విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి'

తొండంగి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తరగతిలో బాగా వెనుకబడిన సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈవో అనిశెట్టి సుబ్బిరెడ్డి అన్నారు. బుధవారం రావికంపాడులో నిర్వహించిన క్లస్టర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా పరంగా వెనుకబడిన విద్యార్థులకు రెమిడియల్ టీచింగ్ అందించాలన్నారు. దీనికి సంబంధించి రికార్డు నిర్వహించాలన్నారు. క్లస్టర్ సమావేశంలో చర్చించిన అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలిరావాలి

శంఖవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభకు అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని నియోజకవర్గ పరిశీలకుడు అమ్మిశెట్టి వాసు కోరారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రచార రథాలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ జనసేనానికి మద్దతుగా నిలవాలని కోరారు. రైల్వే వినియోగదారుల కమిటీ సభ్యుడు గొర్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో హలో ప్రత్తిపాడు- చలో పిఠాపురం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో లకనం శ్యామ్ ప్రసాద్, యర్రంశెట్టి బాబ్జీ, కరణం సుబ్రహ్మణ్యం, పార్టీ మండల అధ్యక్షుడు గాబు సుభాష్, తలపంటి బుజ్జి, కీర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కత్తిపూడిలో ప్రచారం రథాలను ప్రారంభిస్తున్న వాసు

మహిళలకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మహిళలకు టైలరింగ్ శిక్షణపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ 18-50 ఏళ్ల మధ్య గల బీసీ, ఓసీ మహిళలకు ప్రభుత్వం ప్రాథమిక టైలరింగ్ శిక్షణ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. గ్రామీణ మహిళలకు 45రోజుల్లో రోజుకు 8గంటలు, 60 రోజుల్లో రోజుకు 6గంటలు, 90రోజుల్లో రోజుకు 4గంటలు చొప్పున నైపుణ్య తరగతులు నిర్వహిస్తారన్నారు. శిక్షణ అనంతరం మోడల్ కుట్టుమిషన్‌తో పాటు సర్టిఫికెట్ అందజేస్తారన్నారు. ఓబీఎంఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టీడీపీ మండలాధ్యక్షుడు సూతి బూరయ్య, ఎంపీటీసీలు కొప్పుల బాబ్జీ, పసల సూరిబాబు, టీడీపీ నాయకులు జ్యోతుల పెదబాబు, సుబ్బరాజు, బస్వా ప్రసాద్, షైరాల కనకారావు, చిక్కాల లక్ష్మణరావు, జిగటాపు సూరిబాబు, పలివెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహాసేన రాజేష్‌కు ఎంపీ సతీష్ పరామర్శ

ప్రత్తిపాడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పితృ వియోగంతో బాధపడుతున్న ఉత్తరకంచి గ్రామానికి చెందిన మహాసేన రాజేష్‌ను బుధవారం ఎంపీ సానా సతీష్ ఫోన్‌లో పరామర్శించారు. అలాగే ఎంపీ అనుచరుడు కాకినాడ జీజీహెచ్ కమిటీ మెంబర్ లక్ష్మణ్‌బాబు ఉత్తరకంచి విచ్చేసి రాజేష్ తండ్రి సాదు సుందర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్, కాకినాడ పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, ఉత్తరకంచి సర్పంచ్ మంతెన వెంకటరమణ, సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ళ అప్పారావు తదితరులు ఉత్తరకంచి వెళ్లి సాదుసుందర్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మహాసేన రాజేష్‌ను పరామర్శించారు.


ఉత్తరకంచిలో మహాసేన రాజేష్ తండ్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మెల్యేకు మంత్రి లోకేష్ పరామర్శ

ప్రత్తిపాడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శస్త్ర చికిత్స చేయించుకున్నారు. సత్యప్రభను బుధవారం మంత్రి నారా లోకేశ్ ఫోన్‌లో పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీ సానా సతీష్ సత్యప్రభకు ఫోన్ చేసి పరామర్శించారు.

శాంతి ఆశ్రమానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు

ప్రత్తిపాడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపు సత్యప్రభ కృషితో శాంతిఆశ్రమం గ్రామానికి 11కేవీ/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైందని టీడీపీ మండల నాయకులు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈవారంలో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తారని తెలిపారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో చింతలూరు, వెంకటనగరం, యుజేపురం, తోటపల్లి, శాంతి ఆశ్రమం, వాకపల్లి, పోతులూరు తదితర గ్రామాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. సబ్‌స్టేషన్ మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. అమరాది వెంకట్రావు, కొమ్ముల కన్నబాబు, జింకలఫకీర్, బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, ఇళ్ళ అప్పారావు, సర్పంచ్‌లు రొంగల సత్యనారాయణ, వనపర్తి నాగేశ్వరరావు, అడ్డాల త్రిమూర్తులు పాల్గొన్నారు.

'ర్యాగింగ్ జోలికి పోవద్దు'

గండేపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్ తెలిపారు. ముఖ్య అతిథులుగా గండేపల్లి, పెద్దాపురం ఎస్ఐలు యూవీ శివనాగబాబు మాట్లాడారు. మాటలు లేదా చర్యలు ద్వారా ఇతర విద్యార్థులను వేధించడం, ఆట పట్టించడం, దురుసుగా ప్రవర్తించడం, చికాకు, కష్టం, మానసిక హాని, భయం వంటి చర్యలు ర్యాగింగ్ పరిధిలోకి వస్తాయన్నారు. విద్యార్థులు ర్యాగింగ్ జోలికి పోవద్దని, సీనియర్స్, జూనియర్స్ మధ్య స్నేహభావం పెంపొందేలా కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్, యాంటీ ర్యాగింగ్ కమిటీ కోఆర్డినేటర్ విన్నీ థెరిస్సా, అధ్యాపకులు డాక్టర్ బీఎన్‌బీ వైదేహి, డాక్టర్ ఎస్.దివ్య తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్‌రూమ్‌కు భూమిపూజ


భూమిపూజ నిర్వహిస్తున్న యనమల రాజేష్

అన్నవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 12వేల ఎకరాలకు సాగునీరందించే పంపా రిజర్వాయర్‌కు తుపానుల సమయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో నష్టం తగ్గించేందుకు రూ.25లక్షలతో నిర్మించే కంట్రోల్ రూమ్‌కు తుని టీడీపీ నాయకులు యనమల రాజేష్ బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా ఎమ్మెల్యేలు యనమల దివ్య, వరుపుల సత్యప్రభలు రిజర్వాయర్‌పై దృష్టిసారించారన్నారు. ఇప్పటికే బ్యారేజీ గేట్ల ఏర్పాటుకు రూ.3.36కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. భవిష్యత్‌లో పంపా ఆయకట్టు భూములన్నీ రెండు పంటలు పండే విధంగా కార్యాచరణ చేపడుతున్నట్లు రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో పంపా నీటి సంఘం చైర్మన్ బైరావర్గుల రామచంద్రమూర్తి, ఇరిగేషన్ అధికారులు శేషగిరి, శ్రీదేవి, నీటి సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

కిర్లంపూడి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ నిధులతో జనసేన ఎంపీటీసీ గోకేడ రాజా ఆధ్వర్యంలో తామరాడ గ్రామం కొబ్బరితోట కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ శంకుస్థాపన చేశారు. మాజీ సర్పంచ్ తోట అయ్యన్న, అనుకుల శ్రీకాంత్, గోకేడ సత్యనారాయణ, గోకేడ ప్రసాద్, కాయల మణికంఠ పాల్గొన్నారు.

'ఆకుకూరలు ఆరోగ్యకరం'

గండేపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆకుకూరలు ఎంతో ఆరోగ్యకర ఆహారమని ఎంపీడీవో నాతి బుజ్జి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పండించిన తోటకూర, గోంగూర తదితర ఆకుకూరలను అంగన్‌వాడీ టీచర్లకు ఎంపీడీవో, ఎంపీపీ చలగళ్ల దొరబాబు అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ప్రాంతంలో ఆకుకూరలు పండించి అంగన్‌వాడీలకు అందించాలనే లక్ష్యంతో మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది,అంగన్‌వాడీలు ఉన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

రౌతులపూడి, మార్చి12(ఆంధ్రజ్యోతి): బీబీపట్నం రామాలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. గ్రామ ప్రజల సమక్షంలో వాస్తుపండితుడు శ్రీనివాసవర్మ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10.42 గంటలకు వేదమంత్రోచ్ఛారణల నడుమ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. తొలుత ఆలయ ఆవరణలో హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో నిర్వహించినఅన్నసమారాధనలో పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు మంజూరు

రౌతులపూడి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మహిళలకు వంద కుట్టుమిషన్లు మంజూరైనట్టు ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబ శివరావు అన్నారు. బుధవారం రౌతులపూడిలో పార్టీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. అరులైన వారు కుట్టుమిషన్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సింహాద్రి పెదబాబు, జె.రాజా, తంటపురెడ్డి అప్పారావు, పనగడుగుల రమణ తదితరులు ఉన్నారు.

కుట్టుమిషన్ల అందజేత

జగ్గంపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక టవర్ కాలనీలో గల కుట్టుమిషన్ శిక్షణా కేంద్రం స్నాతకోత్సవం హిజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ పాస్టర్ పి.సురేంద్ర, నీలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్వీ ఎస్ అప్పలరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. 2నెలలు మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ పొందగా వారికి ఉచితంగా కుట్టుమిషన్లు దైవజనులు అందించారు. ముఖ్యఅతిథి హిజ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో దైవజనులు పాస్టర్ పి.సురేంద్రకుమార్ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, జేవీఆర్ గ్రూప్స్ అధినేత జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, వెలిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

గృహాలకు అదనపు సాయంపై హర్షం

చింతూరు మార్చి 12 ఆంధ్రజ్యోతి: చింతూరు మండలంలో పీఎంఏవై గ్రామీణ పథకం, పీఎం జన్మన్ పథకం మంజూరైన ఇళ్లకు ప్రభుత్వం అదనపు సాయం ప్రకటించడంపై గృహనిర్మాణ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలో పీఎంఏవై కింద 448, పీఎం జన్మన్ కింద 185 ఇళ్లు గతంలో మంజూరయ్యాయి. గిరిజనులకు అదనపు సాయంగా రూ.75 వేలు, కొండరెడ్లకు లక్ష సాయాన్ని అందించనున్నారు. అదనపు సాయం మంజూరుకు కృషి చేసిన మంత్రి పార్థసారధి, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే శిరిషాదేవీలకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

గృహ నిర్మాణాలకు నిధుల మంజూరుపై హర్షం

రాజవొమ్మంగి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో గిరిజనులకు గతంలో మంజూరైన గృహాలకు నిధులు సరిపడక అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఈ విషయాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జీవో ద్వారా అదనపు నిధులు మంజూరు చేయడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు

వైసీపీ ఆవిర్భావ వేడుకలు

రాజవొమ్మంగి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద బుధవారం వైసీపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. వైసీపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకుడు జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ పురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ 15వ ఆవిర్భావ వేడుకలు మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. దివంగత రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, జెండాను ఎగుర వేశారు. జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలు, ఎస్సీసెల్ నాయకులు మాచర్ల గంగులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారి సందర్శన

రాజవొమ్మంగి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లా విద్యాశాఖాధికారి సందర్శించారు. ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశమై అకడమిక్ విషయాలపై చర్చించారు. మధ్యాహ్న భోజన పథకం తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం క్లస్టర్ సమావేశానికి హాజరై ప్రైమరీ ఉపాధ్యాయులతో చర్చించారు.

27 నుంచి నూకాలమ్మ ఉత్సవాలు

రాజవొమ్మంగి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగిలో నూకాలమ్మ అమ్మవారి ఉత్సవాలు ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ గొల్లపూడి రమణి తెలిపారు. బుధవారం నూకాంబిక ఆలయం వద్ద గ్రామ పెద్దలు, గ్రామస్తులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తామని కమిటీ సభ్యుడు గొల్లపూడి పెద్దిరాజు అన్నారు.

అసంపూర్తిగా మంగంపాడు పీహెచ్‌సీ నిర్మాణ పనులు

మోతుగూడెం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): డొంకరాయి పరిధిలో ఉన్న మంగంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అసంపూర్తిగా నిలిచిపోయింది. 2022లో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా వీటి పనులు ప్రారంభించారు. దీనికి సుమారు కోటి 52లక్షల బడ్జెట్ కేటాయించగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. రూఫ్ లెవెల్ వరకు నిర్మాణం చేపట్టినప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.55లక్షల వరకు అతడికి బిల్లు చెల్లించారు. ఆ తర్వాత నిర్మాణ పనులు నిలిపివేశారు. బిల్లులు రావని తెలుసుకుని కాంట్రాక్టర్ నిర్మాణ పనులు ఆపేశాడు. ఆర్‌అండ్‌బీ జేఈ ప్రదీప్ కాంట్రాక్టరుకు ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదు. తర్వాత కాంట్రాక్టర్‌కు నోటీసులు కూడా పంపించారు. అయినప్పటికీ స్పందించలేదు. దీంతో మంగంపాడు పీహెచ్‌సీ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి, పీహెచ్‌సీ నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయని తమకు వైద్యం ఎప్పుడు అందుతుందని గ్రామస్తులు, పరిసర ప్రాంతాల ప్రజలు ఎదురుచూస్తున్నారు.